
RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

03 జనవరి 2025 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:183

# పంట సాగుచేసిన ప్రతి రైతుకు రైతు భరోసా

## రైతు భరోసా పై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం



పంట వేసిన ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని క్యాబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయంగా అభిప్రాయపడింది. ఈ అభిప్రాయాన్ని క్యాబినెట్ ముందు ఉంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రైతు భరోసా పై ముందుగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 5, 6, 7 తేదీల్లో గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసా పై విస్తృత ప్రచారం నిర్వహించాలని అభిప్రాయపడినట్టు తెలిసింది. ఒక మండలాన్ని మూడు విభాగాలుగా చేసి 5, 6, 7 తేదీల్లో ప్రజా పాలనలో భాగంగా గ్రామ సభలు నిర్వహించి.. రైతు భరోసా కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని అభిప్రాయ పడినట్టు తెలిసింది. రైతు భరోసా పై సబ్ కమిటీ తన అభిప్రాయాలను క్యాబినెట్ ముందు పెట్టనుంది.

# రైతు భరోసా పథకానికి షరతులు దారుణం: ఎంఎల్‌సి కవిత



హైదరాబాద్ జనవరి 2 రైతు భరోసా పథకానికి షరతులు, నిబంధనలు విధిస్తూ సిఎం రేవంత్ రెడ్డి అన్నదాతకు సున్నం పెట్టే ప్రయత్నం చేస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వంకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకం అమలుకు నిబంధనలను పెట్టడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రైతులకు షరతులు విధించడమేంటని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ప్రభుత్వాన్ని అడుక్కోవాలా..? అని నిలదీశారు. ఎటువంటి నిబంధనలను విధించకుండా బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం ఎంఎల్‌సి కవిత నివాసంలో జరిగిన బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌సి కవిత మాట్లాడుతూ? రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని అన్నారు. ఇప్పటికే ప్రజా పాలన దరఖాస్తుల పేరిట ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించారని గుర్తు చేశారు. ఇంకెన్ని దరఖాస్తులు తీసుకుంటారని అడిగారు. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా లేదా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ తిప్పలు పెడుతారా..? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. కెసిఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకున్నారని, కానీ ఈ కాంగ్రెస్ నాయకులు రైతాంగాన్ని కుదేలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు భరోసాకు షరతులు, నిబంధనలు పెట్టి పెట్టుబడి సాయాన్ని ఎగవేసే ప్రయత్నం చేస్తున్నారని ఎండగట్టారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని అన్నారు.

# రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్



అమరావతి జనవరి 2 : ఏపీ కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం మంత్రివర్గ సమావేశం రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా14 అంశాలపై చర్చ జరుగగా అన్నింటికీ ఆమోదం వ్యక్తం చేసింది. ముఖ్యంగా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహకాల బోర్డు తెలిపిన రూ. 1,82,162 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెట్టుబడుల వల్ల 2,63,411 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముందని వెల్లడించింది . అమరావతిలో రూ. 2,733 కోట్ల పనులకు, రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ నిర్మాణానికి, కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నంద్యాల, కడప, కర్నూల్ జిల్లాలో పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు.. రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసే 500 పీబీజీ ప్లాంట్లకు మంత్రివర్గం ఓకే చెప్పింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని 106 ఎకరాల్లో పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. సీఆర్‌డీఏ 44వ సమావేశంలో తీసుకున్న రెండు పనులకు మంత్రివర్గం ఆమోదించింది. మున్సిపల్ చట్టసవరణ ఆర్డినెన్స్‌కు, భవన నిర్మాణాలు, లేఔట్ల అనుమతుల జారీ అధికారాన్ని మున్సిపాలిటీలకు బదలాయించేలా చట్టసవరణకు అనుమతి ఇచ్చింది.

# మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో రైల్ పొడిగింపు

## నూతన సంవత్సర కానుకగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్ జనవరి 2 : హైదరాబాద్ ఉ త్తర నగరవాసులకు నూతన సంవత్సర కానుకగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభవార్త ప్రకటించారు. మేడ్చల్, శామీర్‌పేట వరకు మెట్రో రైల్ పొడిగించాలని సిఎం నిర్ణయించారు. దీంతో హైదరాబాద్ నార్త్ సిటీ వాసులకుమెట్రో రైల్ కల నెరవేనున్నది. ఈ మేరకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు త యారు చేయాల్సిందిగా హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌విఎస్ రెడ్డిని ఆదేశించారు. సికింద్రాబాద్ ప్యారడైజ్- మెట్రో స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు (23 కిలోమీటర్లు)బీ పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ (జూబ్లీ బస్టాండ్) నుంచి శామీర్ పేట్ వరకు (22 కిలోమీటర్లు) మెట్రో కారిడార్లకు డిపిఆర్ తయారు చేయాల్సిందిగా సిఎం ఆదేశించినట్టు మెట్రోరైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి బుధవారంవిడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. మెట్రో రైల్ ఫేజ్-2 'బి' కారిడార్ అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపించవలసిందిగా సిఎం ఆదేశించినట్టు మెట్రోరైల్ ఎండి ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఇలా ఉండగా బుధవారం మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హైదరాబాద్ మెట్రోరైల్ ఎండి ఎఎన్‌విఎస్ రెడ్డితో ఈ రెండు కారిడార్లకు డిపిఆర్ తయారీ పై సిఎం రేవంత్‌రెడ్డి చర్చించి ఈ మేరకు కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుండి తాడ్ బన్డ్, బోయినపల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఒఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్‌కు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ నిర్మించనున్నారు. అదే విధంగా జెబిఎస్ మెట్రో స్టేషన్ నుండి విక్రంపురి, కారా?నా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకింపేట్, తూముకుంట, ఒఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్ పేట్ కు 22 కిలోమీటర్ల పొడవునా ఈ కారిడార్ విస్తరించి ఉంటుందని సిఎం రేవంత్‌రెడ్డికి మెట్రో ఎండీ ఎన్‌విఎస్ రెడ్డి వివరించారు. గతంలో మల్కాజ్ గిరి ఎంపిగా ఈ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, ఈ కారిడార్‌ల రూట్ మ్యాప్ లపై తనకు పూర్తి అవగాహన ఉందని సిఎం గుర్తు చేశారు. ఈ కొత్త మెట్రోరైల్ కారిడార్ రూట్ మ్యాప్ పై మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ కు కూడా వివరించి ఆయన సూచనలు, సలహాలను తీసుకోవలసిందిగా సిఎం ఆదేవించినట్టు ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. డిపిఆర్ మూడు నెలల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని సిఎం సూచించినట్టు ఎండి చెప్పారు. మెట్రో ఫేజ్-2 'ఏ' భాగం లాగే 'బి' భాగాన్ని కూడా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ అనుమతికి కోసం పంపించాలని సిఎం ఆదేశించడంతో డిపిఆర్, ఇతర అనుబంధ డాక్యుమెంట్ ల తయారీ చేపడుతున్నట్టు మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు.

# క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 2, (న్యూస్ పల్స్)పారిస్ ఒలింపిక్స్‌లో షూటింగ్‌లో రెండు పతకాలు సాధించి భారత షూటర్ మను బాకర్‌కు ఖేల్‌రత్న అవార్డు ప్రకటించింది కేంద్రం. మను భాకర్ తోపాటు ప్రపంచ చెస్ ఛాంపియన్ విజేత డి గుకేష్‌ను కూడా ఖేల్ రత్న అవార్డుతో కేంద్ర సత్కరించింది. యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఖేల్ రత్న అవార్డులు పొందే క్రీడాకారుల జాబితాను విడుదల చేసింది. మను భాకర్, డి గుకేష్, ప్రవీణ్ కుమార్‌కు మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డును ప్రకటించారు. పారిస్ ఒలింపిక్స్ 2024లో హాకీ జట్టుకు కాంస్య పతకాన్ని అందించిన హర్మన్‌ప్రీత్ సింగ్ కూడా ఖేల్ రత్న అందుకోనున్నారు.

క్రీడాకారులు అవార్డు వచ్చిన గేమ్ పేరు

1 గుకేష్ డి చెస్
2 హర్మన్‌ప్రీత్ సింగ్ హాకీ
3 ప్రవీణ్ కుమార్ పారా-అథ్లెటిక్స్
4 మను భాకర్ షూటింగ్

అథ్లెట్ల ఈ అవార్డులను జనవరి 17, 2025 ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. కమిటీలు సిఫార్సుల మేరకు మను భాకర్, డి గుకేష్, హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌ను ఖేల్ రత్నతో సత్కరించనుంది. కొన్ని రోజుల క్రితం ఖేల్ రత్న అవార్డు సిఫార్సు చేసిన అథ్లెట్ల జాబితాలో మను భాకర్ పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. బహుశా తన వైపు నుంచే తప్పు జరిగిందని మను స్వయంగా అంగీకరించింది.

ధాన్యఖేల్‌రత్న అవార్డులతోపాటు 32 మందికి అర్జున్ అవార్డులను కూడా కేంద్రం ప్రకటించింది. ఆ వివారలు ఇలా ఉన్నాయి.

అర్జున అవార్డు 2024 అందుకున్న క్రీడాకారులు

1 జ్యోతి యర్రాజీ(అథ్లెటిక్స్)
2 అన్నూ రాణి (అథ్లెటిక్స్)
3 నీతు (బాక్సింగ్)
4 సావీటీ బాక్సింగ్
5 వంటికా అగర్వాల్ (చెస్)
6 సలీమా టెటే (హాకీ)
7 అభిషేక్ (హాకీ)
8 సంజయ్ (హాకీ)
9 జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)
10 సుఖజీత్ సింగ్ (హాకీ)
11 రాకేష్ కుమార్ (పారా ఆర్చరీ)
12 ప్రీతి పాల్ (పారా-అథ్లెటిక్స్)
13 జీవన్‌జీ దీప్తి (పారా-అథ్లెటిక్స్)
14 అజీత్ సింగ్ (పారా-అథ్లెటిక్స్)
15 సచిన్ సర్జేరావు ఖిలారీ (పారా-అథ్లెటిక్స్)
16 ధరంబీర్ (పారా-అథ్లెటిక్స్)
17 ప్రణవ్ సూర్మ (పారా-అథ్లెటిక్స్)
18 హెచ్ హోకాటో సెమా (పారా-అథ్లెటిక్స్)
19 సిమ్రాన్ (పారా-అథ్లెటిక్స్)
20 నవదీప్ (పారా-అథ్లెటిక్స్)
21 నితేష్ కుమార్ (పారా-బ్యాడ్మింటన్)
22 తులసిమతి మురుగేషన్ (పారా-బ్యాడ్మింటన్)
23 నిత్య శ్రీ సుమతి శివన్ (పారా-బ్యాడ్మింటన్)
24 మనీషా రామదాస్ (పారా-బ్యాడ్మింటన్)
25 కపిల్ పర్మార్ (పారా-జూడో)
26 మోనా అగర్వాల్ ( పారా-షూటింగ్)
27 రుబీనా ఫ్రాన్సిస్ (పారా-షూటింగ్)
28 స్వప్నిల్ సురేష్ కుసలే (షూటింగ్)
29 సరబ్జోత్ సింగ్ (షూటింగ్)
30 అభయ్ సింగ్ (స్క్వాష్)
31 సజన్ ప్రకాష్ (స్విమ్మింగ్)
32 అమన్ (రెజ్లింగ్)

2024 క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి శిక్షణ ఇచ్చిన వారికి లైఫ్‌టైం ఎచ్చీవ్‌మెంట్ అర్జున అవార్డు ప్రకటించింది. సుచాసింగ్ (అథ్లెటిక్స్) మురళీకాంత్ రాజారామ్ పేట్కర్ (పారా-స్విమ్మింగ్)

ఐదుగురు కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డు లభించింది.

1 సుభాష్ రాణా (పారా-షూటింగ్ రెగ్యులర్)
2 దీపాలి దేశ్‌పాండే (షూటింగ్ రెగ్యులర్)
3 సందీప్ సాంగ్వాన్ (హాకీ రెగ్యులర్)
4 ఎస్ మురళీధరన్ (బ్యాడ్మింటన్) జీవితకాల సాఫల్య పురస్కారం
5 అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్‌బాల్) జీవితకాల సాఫల్య పురస్కారం

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాన్ని కూడా కేంద్రం ప్రకటించింది. ఇది అవార్డును ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియాకు అందించింది.

ప్రజాబలం

03 జనవరి 2025 శుక్రవారం

# సన్నగిల్లుతున్న ప్రజాస్వామ్య విలువలు

అదుపులేని సంపదతో ఆధిపత్యం చెలాయిస్తున్న ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు కొదిమంది బిలియనీర్ల ముందు సాగిలపడటం, వారి గుప్పెట్లో 'ఆర్థిక నిరంకుశత్వం' కొనసాగడం ఆందోళన కలిగిస్తున్నది. కేవలం తమ అక్రమ సంపదకు రక్షణ కవచంగా మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థను తమ గుప్పెట్లో చీకించుకుంటున్న కొద్ది మంది బిలియనీర్ల వ్యవహారశైలి నిరంకుశ వ్యవస్థల అధినేతల కన్నా ప్రమాదకరంగా మారుతున్నది. ప్రజాస్వామ్యం, సామ్రాజ్యవాదం కూడలిలో ఒక వ్యక్తి స్థిరంగా న్యాయం, సమానత్వం కోసం తన స్వరం వినిపించగలగడం ఆశ్చర్యకరమే.అమెరికా సెనేట్‌లో తన మూడవ పదవీకాలం గడుపుతూ, అమెరికన్ కాంగ్రెస్ చరిత్రలో ఎక్కువ కాలం పనిచేసిన స్వతంత్ర సెనేటర్ బెర్నీ సాండర్స్ ఆర్థిక అసమానత, రాజకీయ అవినీతికి వ్యతిరేకంగా పోరాటానికి పర్యాయపదంగా నిలుస్తున్నారు. 'చాలా తక్కువ సంఖ్యలో ధనవంతులైన బిలియనీర్లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ భాగాన్ని కలిగి ఉన్నారు. దానిని నియంత్రిస్తున్నారు' అంటూ ప్రస్తుత పరిణామాలపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2020 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఐదు బిలియన్ల మంది పేదలుగా మారగా, అదే సమయంలో ప్రపంచంలోని ఐదుగురు ధనవంతులైన బిలియనీర్లు తమ సంపదను రెట్టింపు చేసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఆయన ప్రకారం, ఈ బిలియనీర్లు ప్రతి గంటకు ఊహించలేని రేటుతో వి14 మిలియన్ల సంపదను సేకరిస్తున్నారు. ప్రపంచంలోని అత్యంత ధనవంతుడైన ఎలోన్ మస్క్, కొన్ని నెలల్లోనే తన సంపదకు గత అమెరికా ఎన్నికల అనంతరం వి 120 బిలియన్లను జోడించాడు. సాండర్స్ స్పష్టమైన ఆగ్రహంతో 'ఈ సంపద దొరికిందా?' అని ప్రశ్నించారు. రెండవ ధనవంతుడైన జెఫ్ బెజోస్ కూడా వెనుకబడి లేదు. అదే కాలంలో అతని సంపద వి 67 బిలియన్లు పెరిగింది. మరో ఆందోళనకర పరిణామం దారుణంగా జరుగుతున్న పన్నుల ఎగవేత. పలు నివేదికలను ఉటంకిస్తూ, కేమన్ దీవులు వంటి ఆఫ్‌షోర్ పన్ను స్వర్గధామాలలో వి32 ట్రిలియన్ల వరకు ఇటువంటి సంపన్నులు నిల్వ చేశారని, ఉద్దేశపూర్వకంగా తమ న్యాయమైన పన్నుల వాటాను చెల్లించకుండా తప్పించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 'వేరే మాటల్లో చెప్పాలంటే, ప్రభుత్వాలకు నిధులు తక్కువగా చేస్తూ, ఈ వ్యక్తులు పన్ను స్వర్గధామాలలో ట్రిలియన్ల కొద్దీ దాచిపెట్టారు' అని సాండర్స్ స్పష్టం చేశారు. 'మా (అమెరికా) ఇటీవలి ఎన్నికలను కొనుగోలు చేయడానికి కేవలం 150 మంది బిలియనీర్ కుటుంబాలు దాదాపు వి2 బిలియన్లు ఖర్చు చేశాయి' అని సాండర్స్ తెలిపారు. ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతుగా ఎలోన్ మస్క్ వి277 మిలియన్లు ఖర్చు చేసిన మొత్తాన్ని సాండర్స్ 'పెట్టుబడి' అని పిలిచారు. ఇది మస్క్ తన ప్రయోజనాల కోసం చెల్లించిన మొత్తంగా అభివర్ణించారు. రక్షణ కాంట్రాక్టర్లు కూడా ఈ వ్యవస్థలో భాగస్వాములు అని సాండర్స్ ఆరోపించారు. ఎన్నికల చక్రంలో వి38 మిలియన్లు ఖర్చు చేసిన ఈ కార్పొరేషన్లు ఇప్పుడు ట్రిలియన్ డాలర్ల సైనిక బడ్జెట్ నుండి ప్రయోజనం పొందేందుకు సిద్ధంగా ఉన్నాయి. సాండర్స్ ప్రకారం, ఈ బడ్జెట్ వ్యర్థాలు, మోసాలతో నిండి ఉంది. ప్రజలకు జవాబుదారీతనం కంటే కొంతమందికి లాభాలకు ప్రాధాన్యత ఇస్తుంది.'ఇది ప్రజాస్వామ్యం కాదు అని సాండర్స్ ప్రకటించారు. ఇది ఒక వ్యక్తి, ఒక ఓటు కాదు. ఇది మనమందరం కలిసి మన భవిష్యత్తును నిర్ణయించుకోవడం కాదు. ఇది ఒక సామ్రాజ్యవాదం అని ఆయన స్పష్టం చేశారు. భారతదేశంలో సైతం పరిస్థితులు అందుకు భిన్నంగా లేవు. మన ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేశామని, మరో రెండు, మూడేళ్ళలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కాబోతుందని ప్రధాని నరేంద్ర మోడీ గర్వంగా చెప్పుకుంటున్నారు. అదే సమయం లో గత ఐదేళ్లుగా 80 కోట్ల మంది పేదలకు రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తున్నామని, మరో నాలుగేళ్లు ఇవ్వబోతున్నామని తన ఉదారతను చాటుకుంటున్నారు. అంటే సుమారు 60% మంది ప్రజలు తిండి గింజల కోసం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతున్నట్లు నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారు. నూతన ఆర్థిక సంస్కరణల అనంతరం గనులు వంటి సహజ వనరులు, విమానాశ్రయాలు, ఓడరేవులు వంటి భారీ మౌలిక సదుపాయాలు అన్ని కొద్దీ మంది బిలియనీర్ల హస్తగతం అయ్యాయి. కేవలం ఐదు శాతం మంది మాత్రమే తమ సంపదను పలు రెట్లు పెంచుకోగలుగుతున్నారు. కానీ సుమారు 80% మంది ప్రజల జీవితాలు అగమ్యగోచరంగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో 1950 తర్వాత సుమారు 70% మంది వరకు వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడుతూ మన జిడిపికి 59% వరకు సమకూరుస్తూ ఉండేవారు. అయితే నేడు వారి శాతం సుమారు 60 శాతం వరకు ఉన్నప్పటికీ వారి ఆదాయం మాత్రం జిడిపిలో 16 శాతానికి మించి లేదు. ఆ 16 శాతంలో కూడా నిఖార్సయిన వ్యవసాయం నుండి అందులో సగం 8% మాత్రమే. అంటే నేడు ప్రధాని చెబుతున్న మన ఆర్థికాభివృద్ధి అంత కొద్ది మందికి మాత్రమే పరిమితమవుతున్నది. అత్యధిక శాతం ప్రజలు దారిద్ర్యంలో మగ్గుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో మూడేళ్ళుగా రైతులు తమ డిమాండ్లపై ఆక్రందనలు చేస్తుంటే కనీసం వారితో చర్చలు జరిపేందుకు కూడా మన పాలకులకు తీరిక ఉండటం లేదు. మద్దతు ధరపై స్వయంగా ప్రధాన మంత్రి పార్లమెంట్ సాక్షిగా ఇచ్చినా హామీకి విలువలేకుండా పోయింది. రైతులను తీవ్రవాదులతో పోలుస్తూ ఆర్థిక నేరస్థులకు రాజమర్యాదలు చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలను ఆర్థిక నేరస్థులే నిర్ణయించే ఓ విభ్రాంతికరమైన వ్యవస్థలు నేడు ప్రపంచంలో కొనసాగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులు నేడు ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడను సవాల్ చేస్తున్నాయి. తాజాగా అమెరికాలో జరిగిన అధ్యక్ష ఎన్నికలను చూస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై అక్కడి యువతలో విశ్వాసం సన్నగిల్లుతున్న ఆందోళనకర పరిస్థితులు వెల్లడి అవుతున్నాయి. ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాలకు అండగా నిలబడుతూ వస్తున్న అమెరికా నేడు అన్ని దేశాలలోని 'నిషేధిత' ఉగ్రవాద, తీవ్రవాద, వేర్పాటువాద నేతలకు స్వర్గంగా మారుతుంది. అక్కడి విశ్వవిద్యాలయాలలో వారు బహిరంగంగా కార్యకలాపాలు జరుపుతున్నారు. పైగా హింసాయుత చర్యలకు దిగుతున్నారు. డెమొక్రాటిక్ అభ్యర్థి ఓటమికి ఇటువంటి పరిస్థితులే ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థలకు గట్టి మద్దతుదారునిగా నిలబడిన అమెరికా ఇప్పుడు నిరంకుశ వ్యవస్థలను సహించ గలగడమో లేదా అవసరమైతే మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడటంలో చేయగలుగుతుంది. దురదృష్టవశాత్తు బైడెన్ పరిపాలన యుద్ధనేరాలకు ఇజ్రాయెల్‌ను జవాబుదారీగా చేయడం లో విఫలం కావడంతోపాటు ఆర్థిక రంగంలో సాధించిన విజయాలను సగటు అమెరికా ఓటరుకు స్పష్టమైన ప్రయోజనాలుగా అనువదించడంలో స్పష్టమైన అసమర్థత కారణంగా డెమొక్రాట్ల పాలనపై భ్రమను మరింత తీవ్రతరం చేశాయి. ట్రంప్ స్పష్టంగా జాత్యహంకార, స్త్రీ ద్వేషపూరిత, 'అమెరికా ఫస్ట్' వాక్చాతుర్యంపై దృష్టి సారించారు. 2020 ఎన్నికలలో పోలింగ్ శాతం అంత ఎక్కువగా లేనప్పటికీ, 2024 పోల్స్‌లో ట్రంప్ వాషింగ్టన్ డిసితో సహా దాదాపు 50 రాష్ట్రాలలో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై గణనీయమైన శాతం ఓట్లను సాధించారు. అమెరికాలో ప్రజాస్వామ్యంపై విశ్వాసం క్షీణించడం, అంతర్జాతీయ వ్యవహారాలలో ట్రంప్ నేతృత్వంలో వాషింగ్టన్ నిష్క్రమణ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలపై పడే అవకాశం ఉంది. 'అమెరికాలో ప్రజాస్వామ్య సూత్రాలపై బలహీనమైన నమ్మకం ప్రపంచవ్యాప్తంగా నిరంకుశ పాలనలకు ధైర్యంగా మారుస్తుంది. ముఖ్యంగా ఆసియాలో ప్రజాస్వామ్య సంస్థల స్థిరత్వాన్ని సవాలు చేస్తోంది. ఆసియా దేశాలు అభివృద్ధి చెందుతున్న ప్రపంచ శక్తి గతిశీలత, చైనా ప్రభావం పెరుగుతుండడంతో, బలమైన అమెరికా నాయకత్వం అదృశ్యమయ్యే బలమైన సంభావ్యత ప్రజాస్వామ్య పథాలకు ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది' అని ప్రముఖ మానవ హక్కుల, ప్రజా స్వామ్య ఉద్యమ నాయకురాలు సూ సన్ ఆందోళన వ్యక్తం చేశారు.

# జనవరి 6న చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం

## వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్న ప్రధానమంత్రి

హైదరాబాద్ జనవరి 2 చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం తేదీ ఖరారైంది. జనవరి 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ) వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. రూ.413 కోట్లతో ఏర్పాటు చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను గతేడాది డిసెంబర్ 28 ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిచెందడంతో కార్యక్రమం వాయిదా పడింది.మాజీ ప్రధాని మృతి కారణంగా వారం రోజులపాటు కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకు కార్యక్రమం వాయిదా పడింది.

అయితే తాజాగా జనవరి 6వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి నేరుగా పాల్గొనగా.. ప్రధాని మోదీ మాత్రం వర్చువల్‌గా హాజరై రైల్వే టెర్మినల్‌ను ప్రారంభిస్తారు. అయితే రెండు నెలల్లో మొత్తం నాలుగు సార్లు టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడడం రైల్వే వర్గాలను తీవ్రంగా నిరాశపరిచింది. మరో కొత్త తేదీ ప్రకటించడంతో ఈసారైనా ఎలాంటి అవాంతరాలూ లేకుండా కార్యక్రమం జరగాలని రైల్వే అధికారులు, తెలంగాణ వాసులు కోరుకుంటున్నారు.

ప్రత్యేకతలివే..

జనవరి 6న చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైతే సుమారు 50 వేల మంది ప్రయాణికులకు మోక్షం లభిస్తుంది. గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నుంచి వారికి విముక్తి కలుగుతుంది. చర్లపల్లి వద్ద ప్రస్తుతం 26 రైళ్లు ఆగుతుండగా.. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ 50 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. దీంతో వేగంగా గమ్య స్థానాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. రైల్వే అధికారులు ప్రస్తుతం ఇక్కడ 2 ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాంలతో కలిపి మె?త్తం 9 ప్లాట్‌ఫాంలు, 6 ఎస్కలేటర్లు, 2 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రయాణికుల కోసం ఉచిత వైఫై సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు రచించారు. వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు,

# అనాధ విద్యార్థులకు అన్నదానం

**నూతన సంవత్సర వేడుకలను విహాన్ ఛారిటబుల్ ట్రస్టు విద్యార్థుల మధ్య జరుపుకున్న కావూరి లావణ్య**

**విద్యార్థులతో మమేకమై కలసి భోజనం చేసిన కావూరి లావణ్య.**



ఏలూరు, జనవరి 02 : తల్లిదండ్రులు లేని విద్యార్థుల పట్ల ప్రతీ ఒక్కరూ ఆదరణ చూపాలని కాంగ్రెస్ నాయకురాలు కావూరి లావణ్య పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఏలూరు గ్జేవియర్ నగర్ లోని విహాన్ ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకలను కావూరి లావణ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య విద్యార్థులకు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేసారు. విద్యార్థులతో మమేకమై కలసి భోజనం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విహాన్ ఛారిటబుల్ ట్రస్టు విద్యార్థులకు అవసరం మేరకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ పట్ల బాధ్యతగా ఉంటే
బిడ్డలు అనాధలుగా మారరని, ప్రతీ ఒక్కరూ చెడును విసర్జించి మంచి మార్గంలో పయనించాలని కోరారు. విహాన్ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులను ఆమె అభినందించారు. ట్రస్టు విద్యార్థులు అందరూ మంచి క్రమశిక్షణతో మెలిగి ఉన్నతభ్యాసం చేసి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, అంజి బాబు, టి. సుమన్ బాబు, లక్కీ తదితరులు పాల్గొన్నారు.


# మండపేట మార్కెట్ లోకోట్లు విలువైన మున్సిపల్ ఆస్తి దర్జాగా కబ్జా

**ప్రజల కోసం కట్టిన బాత్రూంలు అడ్డగోలుగా తొలగింపు**

**ఆగ మేఘాలపై పక్క స్థలంలో బాత్రూంల నిర్మాణం ఈ వ్యవహారంలో రూ 5 లక్షలు చేతులు మారినట్టు వినికిడి**

మండపేట కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మండపేట మున్సిపాలిటీ అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని మండపేట ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణంలో ఏదైనా అడ్డగోలుగా పని చేయించుకోవాల్సి వస్తే ఏ మాత్రం అదరకుండా బెదరకుండా పురపాలక సంఘ అధికారులకు ముడుపుల ఇస్తే సరిపోతుంది. అక్కడ నుంచి అన్నీ తాము చూసుకుంటాం అంటూ ఎంతటి అవినీతికైనా బరితెగించి పని పూర్తి చేసే ఘనాపాటీలు మున్సిపాలిటీలో ఉన్నారండంలో అతిశయోక్తి కాదు.మండపేట మున్సిపల్ అధికారుల అవినీతి లీలలను బయట పెట్టడానికి ప్రశ్నించే ప్రజలు కానీ, ఎదురు తిరిగి నిలదీసే నాధుడు గానీ మండపేట పట్టణానికి కరువవడంతో ఇక్కడి అధికారులు ఇష్టానుసారంగా రాజ్యమేలుతున్నారని సర్వత్రా విమర్శలు వినబడుతున్నాయి. వీరి అండ చూసుకొని కొందరు అక్రమార్కులు పేట్రేగిపోతూ దర్జాగా ప్రభుత్వ ఆస్తులకు కన్నం వేయడం అలవాటుగా చేసుకున్నారు. తాజాగా కేపీ రోడ్డులో మందుల షాపు నిర్వాహకుడు తన ఇంటి పక్కనే ఉన్న మున్సిపల్ ఆస్తిపై కన్నేశాడు. వేగుళ్ళ వీర్రాజు మున్సిపల్ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ కు చేర్చి మందుల షాపు వ్యాపారంతో పాటు అక్కడే ఆయనగారి నివాసం కూడా ఉంది. తాజాగా ఆయనగారు ఉన్న ఇంటిని కూల్చేసి కొత్త భవనం నిర్మాణానికి తలపెట్టారు. స్థలం కూడా చదును చేసేసారు. అందులో దాదాపు బిల్డింగ్ మార్కింగ్ కూడా పూర్తయినట్టే. ఆ వ్యక్తి స్థలానికి సంబంధించి పడమర దిక్కున ఉన్న నైరుతీ వాయువ్య భాగాల పొడవునా మున్సిపల్ సంత మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. ఈ షాపింగ్ కాంప్లెక్స్ దక్షిణ భాగం నుంచి మార్కెట్ లోని మాంసం దుకాణాలు ఉండే ఉత్తర భాగం వరకూ సుమారు రెండు సెంట్ల మున్సిపల్ స్థలం ఖాళీగా ఉంది. ఆ స్థలాన్ని 2015 లో అప్పటి టీడీపీ కౌన్సిల్ హయాంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వినియోగంలోకి తెచ్చారు. మార్కెట్ కొనుగోళ్లకు వచ్చే మహిళల కోసం, సంత మార్కెట్లో కూరగాయలు, మాంసం, చేపలు ఇతర నిత్యావసర వ్యాపారాలు సాగించే మహిళల ఆత్మ గౌరవం కోసం లెట్రిన్, బాత్ రూమ్ లను నిర్మించి వినియోగంలోకి తెచ్చారు. 9 సంవత్సరాలుగా ఉపయోగంలో ఉన్న ఈ బాత్రూముల స్థలంపై పక్కనే ఇంటి నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్న అక్రమార్కుడు కన్నేసాడు.మండపేట పట్టణంలో కపిలేశ్వరపురం రోడ్డులో కోట్లాది రూపాయల విలువచేసే మున్సిపల్ ఆస్తిని అప్పనంగా వశపరచుకోవడానికి అతగాడు దాదాపు అన్ని మార్గాలను సుగుమం చేసుకున్నట్టు తెలిసింది. తన స్థలం నైరుతి భాగం వైపు ఉన్న మున్సిపల్ స్థలాన్ని దొడ్డి దారిన లాగేసుకుని అందులో భవన నిర్మాణం చేపట్టడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేసేశారు. ఈ అక్రమ వ్యవహారంలో మున్సిపల్ అధికారులకు ముడుపులు బాగానే ముట్టాయని పట్టణ ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. అధికారులు జేబులు నింపుకోవడం కోసం మున్సిపల్ ఆస్తిని ఇతగాడికి తాకట్టు పెట్టడానికి రికార్డులు కూడా సృష్టించినట్లు తెలిసింది. తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా వీరితో పాటు కొందరు తాబేదారులు కూడా చేతులు కలిపి వాటాలు పంచుకు తిన్నారని మండపేట కోడై కూస్తోంది. ఈ గూడుపుపుటాని వ్యవహారంలో మున్సిపల్ అధికారులకు 20 లక్షల రూపాయలు, చేతులు కలిపిన వారికి ఒక్కొక్కరికి 50 వేల రూపాయలు వంతున సదరు వ్యక్తి ముట్ట చెప్పారని జోరుగా ప్రచారం సాగుతోంది.

# కొత్త ఏడాది వేళ వరుస ప్రమాదాలతో వణికిపోయిన అగ్రరాజ్యం అమెరికా



న్యూ డిల్లీ జనవరి 2 కొత్త ఏడాది వేళ వరుస ప్రమాదాలతో అగ్రరాజ్యం అమెరికా వణికిపోయింది. ఇప్పటికే న్యూ ఓవర్లీన్స్‌లో పికప్ ట్రక్ బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 15కు చేరింది. ఈ ఘటన మరవకముందే మరో రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి.

టెస్లా సైబర్ ట్రక్కు పేలుడు..

లాస్ వేగాస్ లో పేలుడు సంభవించింది. అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ఇంటర్నేషనల్ హోటల్ వద్ద భారీ పేలుడు చోటు చేసుకుంది. హోటల్ వెలుపల ఉన్న టెస్లా సైబర్ ట్రక్కు కారులో ఈ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. సుమారు ఏడుగురు గాయపడ్డారు. న్యూ ఓవర్లీన్స్‌లో ట్రక్ బీభత్సం సృష్టించిన గంటల వ్యవధిలోనే ఈపేలుడు సంభవించచం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ రెండు ఘటనలకు లింక్ ఉందని.. ఉగ్రవాద చర్యగా అనిపిస్తోందని టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ అనుమానం వ్యక్తం చేశారు.

న్యూయార్క్ నైట్ క్లబ్‌లో కాల్పులు..

ఇక బుధవారం రాత్రి న్యూయార్క్ నైట్ క్లబ్‌లో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. క్వీన్స్ కౌంటీకి చెందిన అమజురా నైట్‌క్లబ్‌లో చోటు చేసుకున్న ఈ కాల్పుల ఘటనలో 11 మంది గాయపడ్డారు. దీని వెనుక ఇద్దరు దుండుగులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొత్త ఏడాది వేళ వరుస ఘటనలతో అమెరికా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# శ్రీవారిమెట్టు సమీపంలో ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

**వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం**

**అడవిలోని మరికొంత మంది కోసం టాస్క్ ఫోర్సు తీవ్రంగా గాలింపులు**




తిరుపతి జిల్లా శ్రీవారిమెట్టు సమీపంలో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి మూడు ఎర్రచందనం దుంగలు టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుకార్యాచరణ మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, . వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్ ల మార్గనిర్దేశంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ టి. విష్ణువర్ధన్ కుమార్ టీమ్ బుధవారం చంద్రగిరి మండలం, బాకరాపేట రేంజిలోని నాగపట్ల బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. వీరు శ్రీవారిమెట్టుకు పడమర వైపుకు చేరుకునే సరికి ముగ్గురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వీరిని హెచ్చరించి చుట్టుముట్టే సరికి ఒక వ్యక్తి దుంగను పడేసి పారిపోగా, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేశారు. అక్కడ మూడు దుంగలను సేకరించి, అరెస్టు చేసిన ఇద్దరిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. వీరిపై టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేయగా, ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో మరికొంత మంది స్మగ్లర్లు నిషేదిత అటవీ ప్రాంతంలో ఉన్నట్లు తెలియడంతో వారి కోసం టాస్క్ ఫోర్సు సిబ్బంది తీవ్ర గాలింపులు చేపట్టారు.

# సామాజిక ఉద్యమకారిణి సావిత్రి పూలే

మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం సల్పిన అభ్యుదయ వాది ఆమె. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ మూర్తి. సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారత దేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించిన ధీశాలి. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన సమ న్యాయవాది. మహిళా శిరోముండ నానికి వ్యతిరేకంగా పోరాడిన సాంప్రదాయ వ్యతిరేకి. భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపిన సంస్కరణ వాది. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. సావిత్రి పూలే (3 జనవరి 1831 – 10 మార్చి 1897) గొప్ప సంఘ సంస్కర్త, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాటం చేసారు. కలిగిన చాలామందికి ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ ఆమె ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి. సావిత్రీ బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. ఆమె కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. బంధువులు నిజామాబాద్ జిల్లా లో బోధన్, నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో , అదిలాబాద్ ప్రాంతపు చుట్టుపక్కల మున్నూరు కాపులు వారికి చుట్టాలు. ఆమె తన 9వ యేట 12 ఏళ్ళ జ్యోతిరావు పూలెను 1840లో వివాహ మాడారు. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. భర్త ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతు రాలైనారు. అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో ఆమెపై వేధింపులకు, భౌతిక దాడులకు పూనుకున్నారు. పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్ళు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చే వారు. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా "నా విధిని నేను నిర్వహిస్తున్నాను" అని చెప్పే వారు. ఆమె సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ సమయం లోనే సహకారం గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి కేటా యించాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవిఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. 1851లో మరో పాఠశాల ప్రారంభించారు. ఉపాధ్యాయురాలిగా అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు లాంటి హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, సనాతన సంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయు రాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మ్మొట్టమ్మొదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యను అందించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. ఆమె జీవిత కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొనడమే కాక, 1849లో పూలే, సావిత్రీబాయి దంపతు గృహ బహిష్కారానికి గురి అయినారు. సామాజిక విప్లవకారిణిగా ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ పేరున మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. లింగ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచి వేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఆ సంస్థ కృషిచేసింది. కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్య వివాహలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన వ్యవస్థకు వ్యతి రేకంగా బలమైన ఉధ్యమం నడిపారు. బాల్యం లోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్య పరిచి వితంతువులకు శిరో ముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, ఉద్యమాన్ని నడిపారు. ఆ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు.1868 నుంచి సావిత్రీబాయి అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడి నప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాల లోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాల ల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించా రు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా పేరెన్నిక గన్నా రు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను, మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించారు. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తక రూపంలో వచ్చాయి. జ్యోతీరావు పూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగి పోయి కూడా, దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇదే. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాద్యతను స్వీకరించి నడిపించారు. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధి గ్రస్తులకు సేవ చేసారు. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి కులాలకి చెందిన దళిత చిన్న పిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకు సోకి మార్చి 10, 1897 లో మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ "మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం"గా జరుపు కుంటారు. 1997లో భారత ప్రభుత్వం సావిత్రిబాయి జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పూణే విశ్వ విద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు.

# అంతరిక్ష వాస్తుశిల్పి సతీష్ ధావన్

భారత దేశం గర్వించదగిన అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ ధావన్. ఆయన్ను భారత ఎక్స్పెరిమెంటల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రయోగాత్మక (ద్రవ డైనమిక్స్ పరిశోధన) కు పితామహుడిగా పరిగణిస్తారు.

అల్లకల్లోలం మరియు సరిహద్దు పొరల రంగంలో అత్యంత ప్రసిద్ధ పరిశోధకులలో అగ్రగణ్యుడు గా భావిస్తారు. గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబల్ పి.హెచ్.డి సాధించి, ధావన్ గ్రామీణ విద్యలోను, రిమోట్ సెన్సింగు, ఉపగ్రహ సమాచారాల లోను పరిశోధనలు చేసాడు. వాటి ఫలితంగానే ఇన్‌శాట్, ఐఆర్ఎస్, పిఎస్ఎల్‌విలు రూపొందాయి.

స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించాడు. భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. భారత దేశపు అత్యున్నత పురస్కారాలు పద్మవిభూషణ్, పద్మ భూషణ్, పొందాడు. విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్. విశిష్ట పూర్వ విద్యార్థి కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 1969 అవార్డు పొందాడు. సతీష్ ధావన్ (1920 సెప్టెంబరు 25 – 2002 జనవరి 3) శ్రీనగర్ లో జన్మించిన ధావన్, భారతదేశం, అమెరికాలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. టర్బులెన్స్, బౌండరీ లేయర్స్ రంగాల్లో ఆయనను అత్యున్నత స్థాయి పరిశోధకుల్లో ఒకరిగా పరిగణిస్తారు. ఆయా రంగాల్లో ఆయన శక్తి సామర్థ్యాలు భారత స్వదేశీ అంతరిక్ష కార్యక్రమ అభివృద్ధికి దోహదపడింది. 1972 లో ఎమ్.జి.కె. మీనన్ తరువాత, ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు.

ప్రొఫెసర్ సతీష్ ధావన్ సమాజాన్ని మార్చే మార్గంగా టెక్నాలజీని, ముఖ్యంగా హై టెక్నాలజీని చూసిన మానవతావాది. భారతదేశం యొక్క అత్యంత విజయవంతమైన అంతరిక్ష కార్యక్రమానికి వాస్తుశిల్పి సతీష్ ధావన్. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు. 1947 లో మిన్నియా పోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబుల్ పి.హెచ్.డి పొందాడు.

డా. ధావన్ స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా (1972–1984) భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా పని చేశాడు. స్పేస్ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకోగానే అణుశక్తి కమిషనులో ఉన్న బ్రహ్మ ప్రకాష్‌ను తిరువనంతపురంలో ఉన్న విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనుగా నియమించాడు. ఇస్రో శీఘ్రగతిన ఎదగడానికి ఆయన తీసుకున్న నిర్ణయం ఎంతో తోడ్పడింది. ఆ తరువాత భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్‌వి అభివృద్ధి కార్యక్రమానికి అబ్దుల్ కలాంను నాయకుడిగా నియమించాడు. 1975 లో ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ నాయకత్వంలో ఎస్ఎల్‌వి అభివృద్ధి జరుగగా, దాని మొదటి ప్రయోగం విఫలమైంది. వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆనాటి పత్రికా సమావేశంలో పాల్గొని ఆ వైఫల్యాన్ని తానే స్వీకరించాడు. రెండవ ప్రయోగం విజయవంత మైనపుడు ఆనాటి పత్రికా సమావేశాన్ని అబ్దుల్ కలాం చేత చేయించాడు.

1951 లో ధావన్ భారత్ శాస్త్ర విజ్ఞాన సంస్థలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1962 దానికి డైరెక్టరుగా నియమితుడై, 1962–1981 వరకు ఐఐఎస్‌సి చైర్మన్ గా పని చేశాడు. ఆయన ఇస్రో ఛైర్మనుగా ఉన్నప్పటికీ, బౌండరీ లేయర్ పరిశోధనలో తన శక్తియుక్తులు నియోగించాడు. ఆయన చేసిన పరిశోధనలను హెర్మన్ ష్లిక్టింగ్, తాను రాసిన బౌండరీ లేయర్ థియరీ పుస్తకంలో వివరించాడు. ధావన్ ఐఐఎస్‌సిలో భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. అయన గ్రామీణ విద్య, రిమోట్ సెన్సింగ్ మరియు ఉపగ్రహ సమాచార మార్పిడిలో మార్గదర్శక ప్రయోగాలు చేశారు. ధావన్ ప్రయత్నాలు ×చీూాు ఒక టెలికమ్యూనికేషన్ ఉపగ్రహం, ×=ూ- ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం మరియు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ూూాఎ)వంటి కార్యాచరణ వ్యవస్థలకు దారితీశాయి, ఇవి భారతదేశాన్ని అంతరిక్ష వ్యవసాయ దేశాల లీగ్‌లో ఉంచాయి.

2002 లో ధావన్ మరణించాక, నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి ఆయన పేరుతో "సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం"గా పేరు పెట్టారు. లూధియానా లోని ప్రభుత్వ కళాశాలను ఆయన పేరిట మార్చారు. పద్మ విభూషణ్, 1981, పద్మ భూషణ్, 1971, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1999 స్వీకరించాడు.

# బటన్ నొక్కుడెప్పుడు వివిధ వర్గాల నుంచి ప్రశ్నలు

విజయవాడ, జనవరి 2,గత ప్రభుత్వంలో అలవాటయిన బటన్ నొక్కే కార్యక్రమం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లేదు. 2019 నుంచి 2024 వరకూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ చంద్రబాబు ప్రాధాన్యతలు వేరు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందచేయాలనుకుంటున్నారు తప్పించి నేరుగా డబ్బులు వారి ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పెద్దగా సుముఖత చూపరు. అందుకే గత ఏడు నెలల నుంచి బటన్ నొక్కడం అనేది లేదు. జనాల ఖాతాల్లో కూడా నగదు కనపడటం లేదు.

కేవలం పింఛనుదారులకు మినహా ఇప్పటి వరకూ ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించింది లేదనే చెప్పాలి. అందుకు రాష్ట్ర ఖజానా కూడా ఒక కారణమని అధికార పార్టీ చెబుతుందిగత ప్రభుత్వంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు నెలలో ఒకటి రెండు సార్లు ఎవరో ఒకరికి బటన్ నొక్కి నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. వారికి ఆర్థికంగా ఇవి ఉపయోగపడేవి. అమ్మఒడి, వసతి దీవెన, చిరు వ్యాపారులు, చేనేతలు, మత్స్యకారులు ఇలా అన్ని సామాజికవర్గాల వారికి కూడా క్యాలెండర్ ను రూపొందించుకుని మరీ నగదును జమ చేసేవారు. తమకు ఈ డబ్బులు గ్యారంటీగా వస్తాయని భావించేవారు. సంక్రాంతి పండగను హుషారుగా ఆనందంగా జరుపుకునే వారు. కానీ గడిచిన ఏడు నెలల నుంచి రూపాయి కూడా బ్యాంకు అకౌంట్ లో పడకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నారన్నది వాస్తవం. బ్యాంకు ఖాతాల్లో నగదు లేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు... గత ప్రభుత్వం అప్పులు చేసి వెళ్లిందని, ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ దానిని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే తమకు అవన్నీ అనవసరం. తమకు అవసరమైనది నగదు. అది అందనప్పుడు అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రకటనలు తమకు కూడు బెడతాయా? ని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరుగా ఉండటంతోనే ప్రజలకు తొలి రెండు నెలల్లోనే అర్థమయింది. చంద్రబాబు అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయారిటీ ఇస్తారు. ఆ రెండు దీర్ఘకాలంలో సంపదను సృష్టిస్తాయని ఆయన బలంగా నమ్ముతున్నారు. అప్పుడు ఆర్థికంగా పేదలు బలపడతారని భావిస్తున్నారు. కానీ జనం మాత్రం అలా అనుకోవడం లేదు. తమకు ఎలాంటి నగదు ఇవ్వకపోవడమేంటని కొందరు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను నిలదీసే పరిస్థితికి గ్రామాల్లో వచ్చిందని అంటున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఎమ్మెల్యే అయితే గ్రామస్తులకు నచ్చచెప్పలేక వెనుదిరిగారు. ప్రభుత్వం పాలసీ ప్రకారం వెళుతుంది. రహదారులు బాగాలేకున్నా, రాష్ట్రానికి రాజధానికి లేకున్నా వారికి ఫరక్ పడదు. తమకు అలవాటుగా మారిన నగదు బ్యాంకు ఖాతాల్లో కనిపించకపోయే సరికి ఆ ఫ్రస్టేషన్ ను ప్రజా ప్రతినిధులపై చూపిస్తున్నారంటున్నారు. అయితే ఏడు నెలలే అయినందున ప్రభుత్వం తన ప్రాధాన్యతలను అమలు చేస్తుందని, గతంలో జగన్ కూడా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల తర్వాతనే పథకాలు అమలు చేశారని, తాము కూడా అంతేనని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కూటమి పార్టీ పాలనపై మాత్రం తమకు నగదు బదిలీ చేయడం లేదన్న అసంతృప్తి మాత్రం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు,గత ప్రభుత్వంలో అలవాటయిన బటన్ నొక్కే కార్యక్రమం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లేదు. 2019 నుంచి 2024 వరకూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ చంద్రబాబు ప్రాధాన్యతలు వేరు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందచేయాలనుకుంటున్నారు తప్పించి నేరుగా డబ్బులు వారి ఖాతాల్లో నగదు జమ చేసేందుకు పెద్దగా సుముఖత చూపరు. అందుకే గత ఏడు నెలల నుంచి బటన్ నొక్కడం అనేది లేదు. జనాల ఖాతాల్లో కూడా నగదు కనపడటం లేదు. కేవలం పింఛనుదారులకు మినహా ఇప్పటి వరకూ ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించింది లేదనే చెప్పాలి. అందుకు రాష్ట్ర ఖజానా కూడా ఒక కారణమని అధికార పార్టీ చెబుతుంది. గతంలో అలవాటయి... గత ప్రభుత్వంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ దాదాపు నెలలో ఒకటి రెండు సార్లు ఎవరో ఒకరికి బటన్ నొక్కి నగదును నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేవారు. వారికి ఆర్థికంగా ఇవి ఉపయోగపడేవి. అమ్మఒడి, వసతి దీవెన, చిరు వ్యాపారులు, చేనేతలు, మత్స్యకారులు ఇలా అన్ని సామాజికవర్గాల వారికి కూడా క్యాలెండర్ ను రూపొందించుకుని మరీ నగదును జమ చేసేవారు. తమకు ఈ డబ్బులు గ్యారంటీగా వస్తాయని భావించేవారు. సంక్రాంతి పండగను హుషారుగా ఆనందంగా జరుపుకునే వారు. కానీ గడిచిన ఏడు నెలల నుంచి రూపాయి కూడా బ్యాంకు అకౌంట్ లో పడకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నారన్నది వాస్తవం. బ్యాంకు ఖాతాల్లో నగదు లేక ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందన్నా... గత ప్రభుత్వం అప్పులు చేసి వెళ్లిందని, ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ దానిని ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే తమకు అవన్నీ అనవసరం. తమకు అవసరమైనది నగదు. అది అందనప్పుడు అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రకటనలు తమకు కూడు బెడతాయా? ని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతలు వేరుగా ఉండటంతోనే ప్రజలకు తొలి రెండు నెలల్లోనే అర్థమయింది. చంద్రబాబు అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రయారిటీ ఇస్తారు. ఆ రెండు దీర్ఘకాలంలో సంపదను సృష్టిస్తాయని ఆయన బలంగా నమ్ముతున్నారు. అప్పుడు ఆర్థికంగా పేదలు బలపడతారని భావిస్తున్నారు. గ్రామాల్లో నిలదీత మొదలు... కానీ జనం మాత్రం అలా అనుకోవడం లేదు. తమకు ఎలాంటి నగదు ఇవ్వకపోవడమేంటని కొందరు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను నిలదీసే పరిస్థితికి గ్రామాల్లో వచ్చిందని అంటున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఎమ్మెల్యే అయితే గ్రామస్తులకు నచ్చచెప్పలేక వెనుదిరిగారు. ప్రభుత్వం పాలసీ ప్రకారం వెళుతుంది. రహదారులు బాగాలేకున్నా, రాష్ట్రానికి రాజధానికి లేకున్నా వారికి ఫరక్ పడదు. తమకు అలవాటుగా మారిన నగదు బ్యాంకు ఖాతాల్లో కనిపించకపోయే సరికి ఆ ఫ్రస్టేషన్ ను ప్రజా ప్రతినిధులపై చూపిస్తున్నారంటున్నారు. అయితే ఏడు నెలలే అయినందున ప్రభుత్వం తన ప్రాధాన్యతలను అమలు చేస్తుందని, గతంలో జగన్ కూడా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలల తర్వాతనే పథకాలు అమలు చేశారని, తాము కూడా అంతేనని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కూటమి పార్టీ పాలనపై మాత్రం తమకు నగదు బదిలీ చేయడం లేదన్న అసంతృప్తి మాత్రం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుందంటున్నారు.

## కల్లు, గీత కార్మికులకు 340 షాపులు

ఒంగోలు, జనవరి 2, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏపీలో గీత కులాలకు మద్యం దుకాణాలను కేటాయించేందుకు రంగం సిద్ధమైంది. మద్యం దుకాణాల కేటాయింపులో గీత కులాలకు ఇస్తామన్న హామీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మద్యం షాపుల్లో గీత కులాలకు 10 శాతం షాపులు కేటాయించాలని, ఇందుకు సంబంధించి వారం రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.రాష్ట్రంలో మొత్తం 3,396 మద్యం షాపులు ఉండగా ఇందులో 10 శాతం అంటే 340 షాపులు గీత కులాలకు ఇవ్వనున్నారు. గౌడ, శెట్టి బలిజ, ఈడిగ, గామల్ల, కలాలీ, శ్రీసాయన, శెగిడి, గౌండ్ల, బలిజ, యాత, సోంది వంటి కులాలకు 10 శాతం రిజర్వేషన్ కింద షాపులు కేటాయిస్తారు. షాపులను అక్కడ ఉన్న ఆయా కులాల సంఖ్య ఆధారంగా వారికి కేటాయిస్తారు.ఒక్కొక్కరు ఎన్ని షాపుల కోసం అయినా ఫీజు చెల్లించి ధరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఒక వ్యక్తికి ఒకటే షాపు కేటాయిస్తారు. ఈ షాపుల కాలపరిమితి 2026 సెప్టెంబర్ 30 వరకు ఉంటుంది. దీనిపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసిన అధికారులు... ఆ వివరాలను సిఎం ముందు ఉంచారు. అన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి నోటిఫికేష్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారుమద్యం రిటైల్ షాపులకు ఇచ్చే మార్జిన్ ను కూడా పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు మద్యం షాపులకు 10.5 శాతం మార్జిన్ ఇస్తున్నారు. దీని వల్ల తాము నష్టపోతున్నామని, మార్జిన్ పెంచాలని యజమానులు కోరుతున్నారు. ఈ విషయంలో వాస్తవ పరిస్థితులను పరిశీలించిన ప్రభుత్వం మార్జిన్ ను తెలంగాణలో ఇచ్చినట్లు ఇక్కడ కూడా 14 శాతం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది.మరోవైపు రూ. 99కి మద్యం అందుబాటులోకి తేవడం, 21 శాతం అమ్మకాలు వీటిపైనే సాగుతున్నాయని... దీని వల్ల అనుకున్న స్థాయిలో ఆదాయం రావడం లేదని అధికారులు వివరించారు. రాష్ట్రంలో 72 శాతం అమ్మకాలు జరిగే 20 మద్యం బ్రాండ్ల రేట్లను తెలంగాణతో పోల్చినప్పుడు ఒక్క బ్రాండ్ తప్ప 19 బ్రాండ్ల మద్యం ఎపిలోనే తక్కువ రేటు ఉందని అధికారులు వివరించారు. ప్రతి సంవత్సరం మద్యం అమ్మకాలు పెరుగుతాయని... అయితే తక్కువ రేట్లకే మద్యం అమ్మకం వల్ల ప్రభుత్వానికి ఆశించిన స్థాయి ఆదాయం లభించడం లేదని అధికారులు తెలిపారు.ఆదాయం తగ్గినా తక్కువ రేటుకే మద్యం అన్ని చోట్లా అందుబాటులో ఉండేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్రంలో బెల్ట్ షాపుల విషయంలో కఠినంగా ఉండాలని సిఎం సూచించారు. మద్యం తయారీ, సరఫరా, సేల్స్ ను టెక్నాలజీ సాయంతో పర్యవేక్షించి... నిబంధనల ఉల్లంఘన జరగకుండా చూడాలని సిఎం ఆదేశించారు.హోలోగ్రామ్ ద్వారా ఎక్కడ తయారైన మద్యాన్ని ఎక్కడ అమ్ముతున్నారు అనేది కూడా తెలుసుకోవాలని.... స్టాక్ వివరాలను తెలుసుకుని తప్పు జరిగితే చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఆదాయం కోల్పోయినా పర్వాలేదని ప్రజలకు మంచి జరగాలి అని ఈ మద్యం విధానం తీసుకువచ్చామని . దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాల మద్యం, నకిలీ మద్యం రాకుండా చూడాల్సిన అవసరం ఉందని సిఎం ఆదేశించారు.ఈ 6 నెలల్లో బెల్ట్ షాపుల మీద 8,842 కేసులు బుక్ చేశామని.... 26 వేల లీటర్లు సీజ్ చేశామని అధికారులు చెప్పగా.... బెల్ట్ షాపుల విషయంలో ఉపేక్షించవద్దని.... వారికి మద్యం అమ్మిన షాపుల పైనా చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. మద్యం అక్రమ తయారీని అరికట్టేందుకు, బెల్ట్ షాపులు నియంత్రణకు, మద్యం వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు నవోదయం 2.0 పేరుతో జనవరి నుంచి ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.అక్రమంగా మద్యం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి చర్యల ద్వారా వారి జీవితాల్లో మార్పులు తెచ్చే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఏపీలో వైరల్ అవుతున్న సోషల్ మీడియా క్యాంపెయిన్స్

గుంటూరు, జనవరి2, సోషల్ మీడియాపై ఏపీ సర్కార్ నయా ప్రచారాన్ని ప్రారంభించింది. సోషల్ మీడియాను మంచికి వాడుదామంటూ భారీ హోర్డింగ్‌లతో ప్రజలకు పిలుపు ఇస్తుంది. మరోవైపు సినీ సెలబ్రిటీలు కూడా రంగంలోకి దిగి ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను మంచి కోసమే ఉపయోగించుకోవాలని, అంతే తప్పా తప్పుడు ప్రచారంతో ఇతరుల పట్ల ద్వేషం ప్రదర్శించొద్దని కోరుతున్నారు.సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం, విద్వేష, విషపూరిత రాతలు వద్దని కోరుతోంది. చెడు పోస్టులు చేయొద్దని విజ్ఞప్తి చేస్తోంది. అసత్య ప్రచారాలకు, దూషణలకు స్వస్తి పలుకుదామంటూ ప్రజలకు పిలుపు ఇస్తోంది. సోషల్ మీడియాపై ప్రజలను, నెటిజన్లను చైతన్యపరిచేలా పోస్టులు చేయాలని సూచిస్తోంది. సోషల్ మీడియాను మంచికి వాడుదాం అంటూ పలు నగరాల్లో భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. అలాగే ఆటోలపై పోస్టర్లు అతికించి ప్రచారం చేస్తోన్నారు. చెడు వినొద్దు, చెడు చూడొద్దు, చెడు మాట్లాడవద్దు అనే గాంధీజీ సూక్తి కాన్సెప్ట్‌తో సోషల్ మీడియాపై క్యాంపెయిన్ చేస్తోంది.త్రీ మంకీస్ బొమ్మకు ఫోర్త్ మంకీ చేర్చి చెడు పోస్టులు వద్దంటూ ఆసక్తికరంగా హోర్డింగులు ప్రభుత్వం పెట్టింది. పోస్ట్ నో ఈవిల్ (చెడు పోస్టు వద్దు) పేరుతో నాలుగో మంకీ బొమ్మతో భారీ హోర్డింగ్‌ల ఏర్పాటు చేశారు. మేక్ సోషల్ మీడియా ఎ పాజిటివ్ ఎక్స్ పీరియన్స్ పేరుతో ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ పెట్టారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం చేయవద్దని, విద్వేష, విషపూరిత రాతలు వద్దంటూ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాను మంచికి, పాజిటివ్ అంశాలకు వేదికగా మార్చుదామని అనే స్లోగన్‌తో పిలుపు ఇస్తున్నారు.విజయవాడ- గుంటూరు దారిలో తాడేపల్లి హైవే వద్ద భారీ హోర్డింగ్‌ల పెట్టారు. రాజధాని అమరావతితో పాటు తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాల్లో ఫ్లెక్లీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అందరికీ అర్థమయ్యేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో వీటిని ప్రదర్శించారు. సోషల్ మీడియాలో విష ప్రచారాన్ని, వ్యక్తిత్వ హననాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం, ఈ తరహా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇప్పటికే బూతులు, మార్ఫింగ్‌లతో పోస్టుల పెట్టిన వారిపై ఇప్పటికే ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. సోషల్ మీడియాపై ప్రజలను, నెటిజన్లను చైతన్యపరిచేలా తాజాగా క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.ఈ క్యాంపెయిన్‌లో హీరో, హీరోయిన్ సినీ ప్రముఖులు భాగస్వామ్యం అయ్యారు. శ్రీలీల, అడవి శేష, అఖిల్ తదితర నటీనటులు కూడా ప్రచారం చేస్తున్నారు. హీరోయిన్ శ్రీలీల వీడియో విడుదల చేశారు. "లైక్స్ కోసం, వ్యూస్ కోసమని తప్పుడు వార్తాలను ప్రచారం చేయొద్దు. మీ వ్యూస్ కోసం ఇంకొకరిని యూజ్ చేసుకోవద్దు. అసత్య ప్రచారాలకు దూరంగా ఉందాం. సామాజిక బాధ్యత వహిద్దాం" అంటూ పేర్కొన్నారు.హీరో నిఖిల్ విడుదల చేసిన వీడియోలో "మనం ఒక వస్తువు కొనేటప్పుడు ఎలాగైతే ఎక్స్‌పైర్ డేట్ చూస్తాం. కానీ సోషల్ మీడియాలో పోస్టు చేసేటప్పుడు అది నిజమా? కాదా? అని ఎందుకు చెక్ చేయం. ఎందుకంటే ఏమవుతుందిలే అనే క్యాజువల్‌గా తీసుకుంటాం. కానీ మీరు సరదాగా షేర్ చేసే ఆ ఫేక్ న్యూస్ కొన్ని జీవితాలను నాశనం చేస్తోంది. కనుక మీరు న్యూస్ షేర్ చేసేముందు, అది నిజమా? కాదా? అని ఒకసారి చెక్ చేసుకోండి. సోషల్ మీడియాను పది మందికి ఉపయోగపడేలా వాడుదాం. అంతేతప్ప ఇబ్బందిపెట్టేలా కాదు" అంటూ పేర్కొన్నారు.నటుడు అడవి శేష విడుదల చేసిన వీడియోలో "ఏమవుతుందిలే అనుకుని ఒక అమ్మాయి పోస్టు కింద చెడ్డ కామెంట్ పెడితే, అది చదివి వారు ఆందోళన చెందుతారు. ఏం కాదులే అనుకుని ఫేక్ న్యూస్ షేర్ చేస్తే, అదే నిజమని చాలా మంది అనుకుంటారు. సో కాస్తా ఆలోచిద్దాం. బాధ్యతగా ఫేక్ న్యూస్ షేర్ చేయొద్దు. చెడ్డ కామెంట్లు పెట్టొద్దు" అని అన్నారు. మరోవైపు జనసేన పార్టీ కూడా సోషల్ మీడియా వేదికగా క్యాంపెయిన్ నిర్వహిస్తోంది. ఉద్యమం చేస్తున్నది ఎవరుఅందరికీ అర్థమయ్యేలా ఆంగ్లం, తెలుగు భాషల్లో వీటిని ఏర్పాటు చేశారు.సోషల్ మీడియాను మంచి కోసం వాడుదాం అంటూ ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ద్వారా చైతన్యం తెచ్చేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. చిన్న చిన్న పోస్టర్లు కాదు ఏకంగాపెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఫ్లెక్సీలు చర్చనీయాంశం అవుతున్నాయి. సోషల్ మీడియా వల్ల జరుగుతున్న అనర్థాలు.. మంచి కోసం ఎలా ఉపయోగించుకోవాలన్న చర్చ కూడా వస్తోంది. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే.. వీటిని ఎవరు ఏర్పాటు చేశారనేదానిపై మాత్రం స్పష్టత లేదు. సినిమా తారలతోనూ ప్రచారం చేయిస్తున్నారు. సలహాలు, నీతులు ఉరకనే చెబుతారు. భారీ హోర్డింగ్‌లకు వేలల్లో వసూలు చేస్తారు ఇలా అన్ని సిటీల్లో వేయాలంటే లక్షలు ఖర్చవుతుంది. అయినా ఎవరూ ఖర్చు పెట్టి చెప్పరు. కానీ ఏపీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో ఎవరి పేర్లు లేవు. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఉంటే జారీ చేసిన వారు సమాచార, ప్రచార సంబంధాల శాఖ అని వేసుకునేవారు. కానీ అలా వేయలేదు. ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసి ఉంటే అంత ఖర్చుపెట్టి పబ్లిసిటీ చేసుకోవడం లేదు.

# కొడాలి నాని అరెస్ట్ తప్పదా



విజయవాడ, జనవరి 2, కొత్త సంవత్సరంలో మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టు తప్పదని విశ్లేషణలు ఉన్నాయి. సరిగ్గా ఇదే సమయంలో ఆయన ప్రధాన అనుచరుడిని గుడివాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి కీలక వాంగ్మూలం సేకరించినట్లు సమాచారం.మాజీ మంత్రి కొడాలి నాని అరెస్టు తప్పదా? ఆయనను ఏ క్షణంలోనైనా పోలీసులు అరెస్టు చేస్తారా? ఆయన అనుచరుడు కీలక వాంగ్మూలం ఇచ్చారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు అలానే ఉన్నాయి. తాజాగా కొడాలి నాని ప్రధాన అనుచరుడు కాలిని గుడివాడ పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు షాపుపై పెట్రోల్ దాడి కేసులో కాళీ అరెస్టయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో గుడివాడ పోలీసులు అస్సాం వెళ్లి మరి కాలిని అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో 13 మందిని అరెస్టు చేయగా.. వారంతా ఇప్పటికే నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. తాజాగా ఖాళీని అరెస్టు చేశారు. విచారణ చేపడుతున్నారు. అయితే తాను మాజీ మంత్రి కొడాలి నాని ఆదేశాల మేరకు అలా చేశానని కాళీ చెప్పినట్లు సమాచారం. దీంతో కొడాలి నాని చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది.వైసిపి ప్రభుత్వ హయాంలో గుడివాడలో టిడిపి కార్యాలయం పై దాడి జరిగింది. ఆ పార్టీ నేత రావి వెంకటేశ్వరరావు పై కూడా దాడి జరిగింది. ఈ రెండు కేసుల్లో కాళీ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. 13 మంది వైసీపీ కార్యకర్తలు ఈ దాడిలో పాల్గొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కేసులో పురోగతి పెరిగింది. ఆ 13 మంది వైసీపీ కార్యకర్తల అరెస్టు జరిగింది. వారంతా ఇప్పుడు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇప్పుడు సూత్రధారిగా భావిస్తున్న కాళీని సైతం అస్సాంలో అదుపులోకి తీసుకున్నారు గుడివాడ పోలీసులు. ఆయనను విచారిస్తున్నారు.

ఎవరి ప్రమేయం ఉందా? ఎవరు ప్రోత్సహించారు? అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.2022 డిసెంబర్ 26న వంగవీటి మోహన్ రంగా వర్ధంతి. గుడివాడలో కార్యక్రమాలు నిర్వహించేందుకు టిడిపి నేతలు సిద్ధమయ్యారు. అయితే డిసెంబర్ 25న టిడిపి నేత రావి వెంకటేశ్వరరావుకు కొడాలి నాని ప్రధాన అనుచరుడు అయిన కాళీ ఫోన్ చేసి హెచ్చరించారు. రంగా వర్ధంతి నిర్వహిస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని రావి వెంకటేశ్వరరావు చెప్పగా.. చంపేస్తానని కాళీ బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే రోజు వెంకటేశ్వరరావు కు చెందిన బట్టల దుకాణం పై కొడాలి నాని అనుచరులు పెట్రోల్ ప్యాకెట్లతో దాడి చేశారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. ఈ క్రమంలోనే టిడిపి కార్యాలయానికి నిప్పంటించబోతుండగా పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది.వైసిపి హయాంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేస్తే అప్పట్లో పట్టించుకోలేదు. ఓటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొడాలి నాని అనుచరులపై వరుసగా కేసులు నమోదు చేశారు. ఇటీవల 13 మందిని అరెస్టు చేయగా.. ప్రధాన అనుచరుడు కాళీ దొరకలేదు. తాజాగా అరెస్టు చేయగా.. ఈ మొత్తం ఎపిసోడ్లో కొడాలి నాని పాత్ర పై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. అయితే కాళీ నుంచి కీలక వాంగ్మూలం తీసుకున్న పోలీసులు కొడాలి నానిని అరెస్టు చేయబోతున్నట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# నెలకో జిల్లాకు జనసేనాని

కడప, జనవరి 2, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తామనే హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి నెలా ఒక జిల్లాలో పర్యటించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పవన్ స్వయంగా రంగంలోకి దిగనున్నారు.2025 కొత్త ఏడాది నుంచి ప్రజల మధ్యకు వెళ్లి వారి ఇబ్బందులు తీసుకొనేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రతి నెల ఒక జిల్లాను ఎంచుకొని పవన్ పర్యటించనున్నారు. ఆ జిల్లాలో వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాల్లో క్యాంపు చేసేలా ఏర్పాట్లు ఉండాలని తన కార్యాలయ అధికారులకి డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు.జిల్లాలోని సమస్యలు, ప్రజల స్థితిగతులు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ప్రత్యక్షంగా ఆయన పరిశీలించనున్నారు. పర్యటనలో రోజంతా ప్రజలతో మమేకం కానున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కడప జిల్లాలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీ బిజీగా ఉన్నారు. రిమ్స్‌లో చికిత్స తీసుకుంటున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును పవన్ పరామర్శించారు. బాధితుడు ఎంపీడీఓ జవహర్ బాబుకు, కుటుంబసభ్యులకు నేనున్నాను.. ధైర్యంగా ఉండమంటూ పవన్ భరోసా కల్పించారు.

# గంజాయి బ్యాచ్ బీభత్సం..

ఏకంగా పోలీసులపైకే కారు ఎక్కించిన వైనం కాకినాడ జిల్లా కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద గంజాయి బ్యాచ్ బీభత్సం సృష్టించింది. అక్కడ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో కొందరు కారులో గంజాయి తరలిస్తున్నారు. కారు ఆపేందుకు ప్రయత్నించగా.. కానిస్టేబుళ్లపైకి కానును ఎక్కించారు. ఈ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు.

# కాపు సామాజిక వర్గంలో ఆందోళన

కాకినాడ, జనవరి 2,జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారంలోకి రాకముందు ఒకలా.. వచ్చిన తర్వాత మరొకలా కనిపిస్తున్నారు. చంద్రబాబు నాయుడు చెప్పినట్లే నడుచుకుంటూ తన పార్టీని పణంగా పెడుతున్నారని సొంత పార్టీ నేతలే అనుకుంటున్నారు. ఎన్నికలకు ముందు అయితే ఒక విధంగా పవన్ కల్యాణ్ ను ఆయన అభిమానులు, సామాజికవర్గం ఊహించుకుంది. కానీ ఇంతలా తగ్గుతారని మాత్రం పవన్ విషయంలో అంచనా వేయలేదు. అంతా చంద్రబాబు దర్శకత్వంలోనే పనిచేస్తున్నట్లు అర్థమవుతుంది. ఇతరపార్టీల నుంచి చేరుతున్న నేతల విషయంలోనూ చంద్రబాబు సూచనల మేరకే కండువాలు కప్పుతున్నారన్న కామెంట్స్ మాత్రం జనసేన పార్టీలో బలంగా వినిపిస్తున్నాయిఒంగోలుకు చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి నుంచి నిన్న మంగళగిరి నియోజకవర్గ నేత గంజి చిరంజీవి వరకూ తన పార్టీలో చేర్చుకోవడం వెనక చంద్రబాబు నాయుడు ఆలోచన ఉందని చెబుతున్నారు. అక్కడ వైసీపీని బలహీనం చేయాలన్న ఆలోచనతో తాను నేరుగా చేర్చుకోవడానికి చంద్రబాబుకు ఇబ్బందులున్నాయి. సొంత పార్టీ నేతలు వ్యతిరేకిస్తారు. అలాగని వైసీపీ అక్కడ వచ్చే ఎన్నికల్లోనూ బలంగా ఉండకూడదు. అయితే అదే సమయంలో ఆ నేతలు కూడా వైసీపీలో కొనసాగకూడదు. ఇది చంద్రబాబు నాయుడు ఆలోచన. అందుకే తన పార్టీలోకి నేరుగా చేర్చుకోలేని నేతలను జనసేన వైపునకు పంపుతున్నారన్న కామెంట్స్ పార్టీలో వినపడుతున్నాయి.ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను చేరిక విషయంలోనూ ఇదే జరిగిందని చెబుతున్నారు. జగ్గయ్యపేటలో బలమైన నేత ఉదయ భాను కావడంతో అతనిని జనసేనలోకి పంపితే తమకు వచ్చే ఎన్నికల్లో ఎలాగూ రాజకీయంగా ఇబ్బందులుండవన్న అంచనాలతో ఈ పనిచేశారంటున్నారు. అలాగే మంగళగిరి నియోజకవర్గంలో ముఖ్యనేత గంజి చిరంజీవిని కూడా జనసేనలోకి పంపింది చంద్రబాబేనన్న టాక్ పార్టీలో బలంగా వినిపిస్తుంది. ఎందుకంటే మంగళగిరిలో నారా లోకేష్ కు మరింత పట్టు పెంచాలంటే గంజి చిరంజీవిని తమలో కలుపుకోవాలి. అయితే తన పార్టీలోకి నేరుగా చంద్రబాబు తీసుకోలేరు. అందుకే గంజి చిరంజీవిని జనసేనలోకి పంపి మంగళగిరిలో లైన్ క్లియర్ చేశారంటున్నారు.జనసేనలో చేరే ప్రతి చేరిక వెనక చంద్రబాబు ఆలోచన ఉంటుందని చెబుతున్నారు. రేపు తమ్మినేని సీతారాం కూడా జనసేనలో చేరితే అది చంద్రబాబు డైరెక్షన్ అన్న కామెంట్ వినపడుతుంది. ఇప్పుడు జనసేనలో చేరిన నేతలు ఎవరికీ వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దక్కే అవకాశం లేదు. అక్కడ టీడీపీ నేతలే పోటీ చేస్తారు. ఒకవేళ నియోజకవర్గాల పెంపు జరిగి అక్కడ సానుకూలత ఉంటే తప్ప వీరికి టిక్కెట్ దక్కే అవకాశం లేదు. జనసేన కోటాలో చేరిన వారికి టిక్కెట్ దక్కకపోయినా పెద్దగా ఇబ్బంది ఉండదు. అదే సమయంలో టీడీపీ విజయానికి ఢోకా ఉండదు. ఈ ప్లాన్ లోనే చంద్రబాబు పవన్ కల్యాణ్ ద్వారా అమలు చేస్తున్నారని, అందుకోసమే పవన్ కు ఇష్టం లేకపోయినా కొందరిని చేర్చుకుంటున్నారని పార్టీలో ముఖ్యనేతలే చెబుతుండటం విశేషం.

# తమ్మినేని దారెటు,,,,



శ్రీకాకుళం, జనవరి 2,మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పవన్ నో చెప్పారా? జనసేనలో చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదా? అందుకే తమ్మినేని వెనక్కి తగ్గారా? వైసీపీలో కొనసాగుతానన్న ప్రకటన అందులో భాగమేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఇటీవల ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జిగా.. కొత్త నేతను నియమించారు జగన్. తన కుమారుడికి ఆ పదవి ఇవ్వాలని కోరారు తమ్మినేని. కానీ జగన్ ఓ ద్వితీయ శ్రేణి నేతకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటినుంచి పార్టీకి దూరంగా ఉన్నారు తమ్మినేని. పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొనడం లేదు. ఇటీవల ఆయన కుటుంబంతో సహా జనసేన లో చేరతారని ప్రచారం పెద్ద ఎత్తున నడిచింది. కానీ ఉన్నట్టుండి తమ్మినేని తాను వైసీపీలోనే కొనసాగుతానని చెప్పడం విశేషం.సందిగ్ధతలో పడిపోయారు సీనియర్ నాయకుడు తమ్మినేని. టిడిపిలో ఒక వెలుగు వెలిగిన ఈ నాయకుడు తర్వాత కష్టాలు ఎదుర్కొన్నారు. జగన్ పుణ్యమా అని స్పీకర్ అయ్యారు. కానీ ఇప్పుడు ఆయన రాజకీయ జీవితానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి.అయితే తమ్మినేని ఒకటి ఆశిస్తే.. జనసేన నుంచి మరో రిప్లయ్ వచ్చింది. తమ్మినేని సీతారాం తెలుగుదేశం పార్టీలోనే ఎదిగారు. పార్టీ ఆవిర్భావం నుంచి 2009 వరకు కొనసాగారు. తరువాత ప్రజారాజ్యంలో చేరారు. ఆ పార్టీ కాంగ్రెస్లో విలీనమైన తర్వాత తెలుగుదేశంలోకి తిరిగి వచ్చారు. కొద్దిరోజులు పాటే ఆ పార్టీలో కొనసాగారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత జగన్ వెంట అడుగులు వేశారు. కానీ ఇప్పుడు జగన్ ఆమదాలవలస అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పించడంతో మనస్థాపానికి గురయ్యారు. టిడిపిలో చేరేందుకు అవకాశం లేకపోవడంతో జనసేనలో చేరడానికి సిద్ధమయ్యారు. అయితే గత ఐదు సంవత్సరాలుగా స్పీకర్ గా ఉన్న తమ్మినేని వ్యవహార శైలిపై అనేక రకాల అభ్యంతరాలు ఉన్నాయి. ఈ విషయంలో చంద్రబాబు నుంచి అభ్యంతరాలు వెళ్లడంతో పవన్ సైతం పునరాలోచనలో పడ్డారు. అందుకే తమ్మినేని చేరికకు బ్రేక్ పడినట్లు ప్రచారం నడుస్తోంది.అయితే ఎట్టి పరిస్థితుల్లో ఆమదాలవలస అసెంబ్లీ టికెట్ ఈసారి తమ్మినేని కుటుంబానికి ఇచ్చే అవకాశం లేదు. కేవలం పెద్దన్న పాత్ర మాత్రమే పోషించాలని జగన్ స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. అయితే ఇప్పుడు అనవసరంగా పార్టీ మారడం ఎందుకన్న అభిప్రాయంతో తమ్మినేని ఉన్నారు. కానీ కుటుంబ సభ్యులు మాత్రం వైసీపీలో కొనసాగకూడదని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తమ్మినేని వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నా.. ఐ కమాండ్ నుంచి ఎటువంటి స్పందన లేదు. తమ్మినేని వదులుకోవడానికి వైసిపి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టమైంది. అదే సమయంలో పవన్ నుంచి సైతం గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో తమ్మినేని ఇరకాటంలో పడినట్టు కనిపిస్తున్నారు. అందుకే వైసీపీలోనే కొనసాగుతానని చెప్పినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రవి శాస్త్రి ఆరు సిక్సుల రికార్డ్ కు 40 ఏళ్ళు



రవి శాస్త్రి ఆరు సిక్సుల రికార్డ్ కు 40 ఏళ్ళు నిండాయి. 18 సంవత్సరాల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన రవిశాస్త్రి... కుడి చేతితో బ్యాటింగ్ ఎడమచేతితో స్పిన్ బౌలింగ్ చేయగలడు. 1985 సంవత్సరంలో జనవరి 3వ తేదీన ఆరు బాళ్లలో ఆరు ఆరు సిక్సర్లు కొట్టిన మొట్ట మొదటి భారతీయుడిగా రికార్డు సాధించాడు రవి శాస్త్రి. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా రవిశాస్త్రి రికార్డు సృష్టించాడు. 1985లో ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ చాంపియన్ క్రికెట్లో తన క్రీడా జీవితంలోనే అత్యంత ప్రతిభను కనబర్చి చాంపియన్ ఆఫ్ చాంపియన్స్‌గా ఎన్నికైనాడు. అదే సీజన్‌లో ఒకే ఓవర్లో వరుసగా 6 సిక్సర్లు కొట్టి ఈ ఘనతను సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో ప్రపంచంలోనే ఈ ఘనతను సాధించిన వారిలో వెస్ట్ఇండీస్ కు చెందిన గారీ సోబర్స్ తర్వాత ఇతను రెండో వాడు మాత్రమే. టెస్ట్ క్రికెట్లో ఇతను 11 సెంచరీలు సాధించాడు, రవిశాస్త్రి క్రికెట్ కు వీడ్కోలు పలికిన తర్వాత క్రికెట్ కామెంటేటర్ గా మారిపోయాడు. ఎన్నో మ్యాచ్ లకు తన స్టైల్లో క్రికెట్ కామెంట్రీ ఇచ్చి ప్రేక్షకులను అలరించారు రవి శాస్త్రి. కొన్ని రోజుల పాటు టీమిండియా కోచ్ గా కొనసాగి టీమిండియా విజయాలను ముందుండి నడిపారు.

# శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో నీరు లీకేజీ
## మీడియా కథనాలతో అధికారుల అప్రమత్తం

శ్రీశైలంశ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రానికి పొంచిఉన్న ప్రమాదంపై యంత్రాంగం అప్రమత్తమయింది. కొద్ది రోజులుగా జీరో ఫ్లోర్ లో నీటి లీకేజీ ప్రారంభమయింది. డ్రాఫ్ట్ ట్యూబ్ చుట్టూ లీక్ నీరు అవుతోంది. ప్లాంట్ అధికారుల సమన్వయ లోపంతో పర్యవేక్షణ కొరవడిందని మీడియాలో వార్తలు వచ్చాయి. అప్రమత్తం అవ్వకపోతే భవిష్యత్తులో ప్లాంట్ కు భారి నష్టం సంభవిస్తుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాంకేతిక నిపుణుల ప్రత్యేక కమిటితో విచారణ చేపట్టాలని కొందరు ఇంజనీర్లు కోరుతున్నారు.

# మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం

## సావిత్రిబాయి పూలే

## -నేడు ఈ చదువుల తల్లి జయంతి



సావిత్రిబాయి పూలే భారతీయ సంఘ సంస్కర్త, భారత దేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు, రచయిత్రి,మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆమె ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజికబాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసారు. సావిత్రి బాయి మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న జన్మించింది. ఆమెది రైతుకుటుంబం. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. సావిత్రి బాయి తన 9వ యేట 12 యేండ్ల జ్యోతిరావు పూలెను 1840లో వివాహమాడారు. ఆ దంపతులకు స్వంత పిల్లలు లేరు. కానీ ఆ జంట యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) ను దత్తత తీసుకున్నారు. "జ్యోతీరావు పూలె" ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనులకు మె?ట్టమె?దటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. 1848 లోనే దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన మె?దటి మహిళ ఉపాధ్యాయురాలు , దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలోనే 1849లో పూలే, సావిత్రీబాయి దంపతులను గృహ బహిష్కారానికి గురిచేశారు. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘున్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో "సత్యాన్ని" శోధించడానికి 1873 లో తన భర్త మహాత్మా పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్యవివాహలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేఖంగా మరియు వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన బ్రాహ్మనిజ వ్యవస్థకు వ్యతిరేఖంగా బలమైన ఉధ్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు సావిత్రీబాయి. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యసోధన కోసం ఉద్యమాన్ని నడిపారు పూలే. ఈ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్యసోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాటశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించినారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి. జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. పూలే మరణాంతరం సత్యసోధాక్ సమాజ్ భాద్యతనీ స్వీకరించి నడిపించింది. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు. ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో కబళించింది. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించిండు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

# రైతుల కోసం పథకాలు...

కొత్త ఏడాది రైతుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టింది. ప్రకృతి వైపరిత్యాలతో తల్లడిల్లుతున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రధాని ఫసల్ బీమా యోజన పరిధిని పెంచింది. ఇందుకు 69 వేల 515 కోట్లు ఈ పథకానికి కేటాయించింది. ఈ పథకంతో 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అంతేకాకుండా పీఎం ఫసల్ బీమా యోజనలో మార్పులు చేశారు. 23 రాష్ట్రాలకు , 4 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ పథకంలో భాగస్వామ్యం ఉంది. అయితే బీమా చెల్లింపు విషయంలో ఈశాన్య రాష్ట్రాలకు 90 శాతం ప్రీమియంను కేంద్రమే భరించబోతోంది. మిగతా రాష్ట్రాల్లో 50 శాతం చెల్లిస్తారు.. మరోవైపు ఎరువులపై సబ్సిడీని పెంచింది కేంద్రం.. విపత్తు తీవ్రతను తగ్గించడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్.. ఈ సంవత్సరాన్ని రైతు సంక్షేమ సంవత్సరంగా ప్రధాని మోదీ ప్రకటించారని అన్నారు. ఫసల్ బీమా యోజన రైతు జీవితాల్లో గణనీయమైన మార్పును తెచ్చిందన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం 11.9 లక్షల కోట్లు గత పదేళ్లలో ఖర్చు చేసినట్టు వెల్లడించారు. అంతేకాదు 2025లో తొలి క్యాబినెట్ భేటీని ప్రధాని మోదీ రైతులకు అంకితం చేసింది కేంద్రంఇక డీఏపీపై అదనపు భారాన్ని కేంద్రమే భరించనుంది. ఇకపై ఒక 50 కిలోల డీఏపీ బస్తా 1350 రూపాయలకే లభ్యం కానుంది. కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనుంది. అదేవిధంగా ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ'కి కేంద్రం రూ.800 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.క్యాబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు ప్రధానిమోదీ. రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం తమదేనని.. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణమన్నారు. 2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేయడం?ఆనందంగా ఉందన్నారు మోదీ.2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసి 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, భూస్థాయిలో ఉన్న వాస్తవాలు మాత్రం వ్యవసాయ విధానాల్లో ఉన్న లోపాలను, కార్పొరేట్ లాభాలను కాపాడే విధానాలను, ప్రతిపక్షాల గళాన్ని అణిచివేసే ప్రభుత్వ వైఖరిని వెల్లడించాయి. ప్రభుత్వం ప్రారంభంలోనే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని పథకాలను ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు రైతులకు ఏడాదికి రూ. 6,000 సాయం అందజేయడం ద్వారాఆర్థిక ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టబడ్డాయి.భూమి ఆరోగ్యకార్డులు, ప్రధానమంత్రి పంట భీమా యోజన వంటి పథకాలు సుస్థిర వ్యవసాయానికి, పంట నష్టాల నుంచి రక్షణకు ఉపయోగపడతాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు, శీతల గిడ్డంగుల వంటి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించే ప్రయత్నంగా గొప్పగా చాటుకున్నారు. కానీ, ఈ చర్యలు పరిమిత ప్రభావాన్ని మాత్రమే చూపించాయి. పిఎం కిసాన్ పథకం ద్వారా కొంతమంది రైతులకే లబ్ధి కలిగింది. అయితే కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వంటి వారు పూర్తిగా ఈ పథకాల పరిధికి దూరంగా ఉన్నారు. పంట భీమా పథకాలు చాలా సందర్భాల్లో రైతులకు న్యాయమైన పరిహారం అందించలేకపోయాయి. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న లక్ష్యం దూరమైంది.జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఒ) ప్రకారం, వ్యవసాయ కుటుంబం సగటు నెలసరి ఆదాయం కేవలం రూ. 10,218 మాత్రమే. ఇది బతుకుదెరువుకు సరిపడటం లేదు. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు ఈ సమస్యలను మరింతగా వేగవంతం చేశాయి. వీటిని సంస్కరణలుగా ప్రచారం చేసినప్పటికీ, రైతులు వీటిని తమ జీవనోపాధిపై నేరుగా దాడిగా చూశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వ్యవస్థను బలహీనపరచడం, వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్ సంస్థలకు అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలు చిన్న రైతులను పెను ప్రమాదంలోకి నెట్టేశాయి. ఈ చట్టాలపై రైతుల నిరసనలు విరుచుకుపడ్డాయి. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల రైతులు ఢిల్లీకి చేరి ఏడాదిన్నరపాటు శాంతియుత నిరసనలు కొనసాగించారు.కానీ ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, కఠినమైన చర్యలను తీసుకుంది. నిరసనకారులపై టియర్ గ్యాస్, వాటర్ కాన్నన్‌లు వాడటంతో పాటు, 750 మందికి పైగా రైతులు అకాల మరణాల పాలయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చివరికి ఈ చట్టాలను 2021 నవంబరులో వెనక్కి తీసుకున్నప్పటికీ, రైతుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఇప్పటికీ అమలు చేయలేదు. పంటల ఉత్పత్తి ఖర్చును 1.5 రెట్లు ఎంఎస్‌పిగా నిర్ణయించడం వంటి అంశాలు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నాయి.రైతుల ఆర్థిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. భారత దేశంలో 86 శాతం మంది రైతులు రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి ఉన్న చిన్న రైతులే. వీరు పెరుగుతున్న ఖర్చులు, సంస్థాగతరుణాల లభ్యతలో లోపం, మార్కెట్ లో అస్థిరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మారుస్తూ, రైతు జీవనోపాధిని సురక్షితంగా చేయడానికి దిశానిర్దేశం చేయాలి. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు పథకాలు అందుబాటులోకి తెచ్చి, ఆర్థిక న్యాయం చేయాలి. రైతుల డిమాండ్లను తీర్చి, సమర్ధనీయమైన వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా మాత్రమే ఒక ప్రజాస్వామ్య భారతదేశం ఆవిర్భవించగలదు.

# ఎట్టకేలకు బోనులో పెద్ద పులి



చంద్రాపూర్ గత కొద్ది నెలలుగా తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పులిని ఎట్టకేలకు చంద్రపూర్ అటవీ అధికారులు బోనులో బంధించారు. గత కొద్ది నెలలుగా ఈ అటవీ ప్రాంతాల్లోని తిరుగుతున్న పెద్దపులి ? ఈ రహదారి వెంటనే రెగ్యులర్గా తిరుగుతుండడంతో వేటగాళ్ల దృష్టి పడే ప్రమాదము ఉండడంతో చాకచక్యంగా వ్యవహరించి దాదాపు వారం రోజులుగా శ్రమించి పులిని ఎట్టకేలకు బోను లో బంధించి చంద్రాపూర్ తరలించారు? సిర్పూర్ టి మండలంలోని మాకిడికి దాదాపు మూడు కిలోమీటర్ల దూరం నుండి అంతర్గాం అటవీ ప్రాంతంలో పులిని బోలో బంధించారు.. తాడోబా ఫారెస్ట్ చంద్రపూర్ కు తరలించారు. మత్తు మందు బంధించిన పులికి అవసరమైన వైద్యం అందించిన తర్వాత తడోబా పులుల సంరక్షణ కేంద్రంలో వదిలిపెట్టనున్నట్లు సమాచారం.

# పెరుగుతున్న భార్య బాధితులు

న్యూఢిల్లీ, జనవరి 2, (న్యూస్ పల్స్) దేశంలో భార్య బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. బెంగళూరులో టెకీ అతుల్ సుభాశ్ ఆత్మహత్య ఘటన మరిచిపోక ముందే ఢిల్లీలో మరో భార్య బాధితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఢిల్లీలో ప్రముఖ కేఫ్ యజమాని ఆత్మహత్య చేసుకోవడం సంచలనం రేపింది. ఉడ్‌బాక్స్ కేఫ్ వ్యవస్థాపకుడు పునీత్ ఖురానా తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. . కళ్యాణ్ విహార్ ప్రాంతం మోడల్ టౌన్‌లో నివాసం ఉంటోన్న పునీత్.. తన గదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పునీత్ ఖురానా, ఆయన భార్య మానికా జగదీశ్ పహ్వా మధ్య విడాకుల కేసు నడుస్తుండగా.. వ్యాపారం విషయంలో ఇద్దరి మధ్య గొడవలు నడుస్తున్నాయిఉడ్‌బాక్స్ కేఫ్ యాజమాన్యం విషయంపై పునీత్, మానికా మధ్య గొడవలు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. భార్య వేధింపులతోనే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడినట్టు పునీత్ కుటుంబసభ్యులు ఆరోపించారు. పునీత్, మానికాకు 2016లో పెళ్లి జరిగింది. ఖురానా, మానికా మధ్య జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన 16 నిమిషాల ఆడియో క్లిప్ ఒకటి బయటకు వచ్చింది. ఈ ఆడియోలో ఇరువురి మధ్య బిజినెస్ ప్రాపర్టీ గురించి జరిగిన వాగ్వాదం రికార్డయ్యింది. 'మనం విడాకులు తీసుకున్నాం.. కానీ, నేను ఇంకా వ్యాపార భాగస్వామినే.. నాకు రావాల్సిన మొత్తం చెల్లించాల్సిందే' అని పునీత్‌ను మానికమె డిమాండ్ చేయడం స్పష్టంగా వినిపిస్తోంది.పునీత్ ఆత్మహత్య ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు.. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పునీత్ భార్యను విచారణకు హాజరుకావాలని నోటీసు పంపారు. తమ కుమారుడిని మానికా చాలా వేధించినట్టు పునీత్ పేరంట్స్ ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం కావాలని వాళ్లు వేడుకుంటున్నారు.ఏడాది వరకు ఇద్దరు బాగానే ఉన్నారు. తరువాత గొడవలు ప్రారంభమయ్యాయి. తన బిడ్డను చాలా టార్చర్ చేసింది.. ఎంతో మానసిక వేదన అనుభవించాడు.. డబ్బుల గురించి , బిజినెస్ గురించి గొడవలు జరిగాయి.. అయితే తన కొడుకు ఎప్పుడు తన బాధను తమకు చెప్పలేదని తల్లిదండ్రులు చెప్పారు. తాము టెన్షన్ పడుతామని చెప్పేవాడు కాదు.. లోలోన చాలా బాధపడ్డాడని చెప్పారు. తన భార్య పెట్టే టార్చర్ భరించలేకే తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కొడుకు మరణించాడు.. తమకు న్యాయం కావాలంటూ పునీత్ తల్లిదండ్రులు చెబుతున్నారు.డిసెంబరు మొదటి వారంలో బిహార్‌కు చెందిన అతుల్ సుభాష్.. బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య నికిత సింఘానియా, ఆమె కుటుంబసభ్యుల వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు అతుల్ 24 పేజీల సూసైడ్ లెటర్ రాసి.. దానిని హైకోర్టు, తాను పనిచేసే ఆఫీసు, తల్లిదండ్రులకు మెయిల్ చేశాడు. న్యాయవ్యవస్థపై కూడా అతుల్ ఆరోపణలు చేయడం.. విడాకుల కేసు విచారించిన జడ్జి తనను రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపించాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలన రేపింది. ఈ కేసులో అతుల్ భార్య నికిత, ఆమె తల్లి, సోదరుడ్ని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరవక ముందే ఢిల్లీలో పునీత్ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర కలకలం రేపుతోంది.

# స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడు

- భారీ శబ్దంతో ఒక్కసారిగా పేలిన రెండు బాయిలర్లు
- ఈ ఘటనలో పలువురు మృతి చెంది ఉంటారని అనుమానం
- మరికొందరికి తీవ్ర గాయాలు
- అర్ధరాత్రి స్టీల్ పరిశ్రమ ఎదుట నెలకొన్న తీవ్ర ఉత్కంఠత

తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పెను ప్రమాదం చోటుచేసుకుంది. పరిశ్రమంలోని రెండు బాయిలర్లు ఒక్కసారిగా పేలినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో భారీగా విస్ఫోటనం జరిగినట్లు తెలుస్తుంది. ఈ ఘటనతో పరిశ్రమలోని పలువురికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్ లలో క్షతగాత్రులను నాయుడుపేట, నెల్లూరు ప్రభుత్వాసుపత్రులకి తరలించారు. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. పేలుడు దాటితో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిశ్రమలో పనిచేస్తున్న పలువురు మృతిచెందవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నట్టు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పరిశ్రమ నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. దీంతో అక్కడ ఉత్కంఠ నెలకొంది.

# మాంజా కోసుకోవడంతో వ్యక్తి మెడకు తీవ్ర గాయాలు

భద్రాద్రి కొత్తగూడెం చంద్రుగొండ మండలం గుర్రాయి గూడెం గ్రామానికి చెందిన ఏరువా కృష్ణారావు భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం పట్టణంలో ఉన్న హెరిటేజ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని తిరిగి బైక్ పై ఇంటికి వెళుతుండగా రామవరం సమీపంలో కొందరు వ్యక్తులు జాతీయ రహదారిపై గాలి పటం ఎగరవేయడం ఆ దారం గొంతుకు తగిలి కోసుకు పోయింది. మెడకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు గుర్తించి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. .

# స్విస్ లో కూడా బురఖా బ్యాన్

న్యూఢిల్లీ, జనవరి 2, (న్యూస్ పల్స్) స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రజలు తిరిగే ప్రైవేట్ భవనాల్లో కూడా బురఖా నిషేధించబడుతుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 96,947) జరిమానా విధించబడుతుంది. ఈ నిర్ణయాన్ని ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో జరిగిన దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో, 51 శాతం మంది బురఖా నిషేధానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ నిర్ణయాన్ని అక్కడి పార్లమెంట్ కూడా ఆమోదించింది. దాదాపు 8.85 మిలియన్ల జనాభా కలిగిన స్విట్జర్లాండ్‌లో, ముస్లింలు 5 శాతం ఉన్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం, బహిరంగ ప్రదేశాల్లో ముఖాన్ని కప్పి ఉంచడం నిషేధించబడింది, ఈ నిబంధనను ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ. 96 వేలు) జరిమానా విధించబడుతుంది. స్విట్జర్లాండ్‌లో 2021 ప్రజాభిప్రాయ సేకరణలో ఆమోదించబడిన ఈ నిషేధాన్ని ముస్లిం సంస్థలు విమర్శించాయి. విశేషమేమిటంటే, 2009లో దేశంలో కొత్త మినార్ల నిర్మాణాన్ని నిషేధించిన గ్రూపునే బురఖాపై నిషేధం విధించింది. 2021లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్విట్జర్లాండ్‌లో 51.21 శాతం మంది ప్రజలు ఈ నిషేధానికి మద్దతుగా ఓటు వేశారు. మితవాద స్విస్ పీపుల్స్ పార్టీ దేశంలో బురఖా నిషేధాన్ని ప్రతిపాదించింది, ఇది దేశ సాంస్కృతిక విలువలు, ప్రజా భద్రతను కాపాడుతుందని వాదించింది. దీని తరువాత, 2022 సంవత్సరంలో దేశ జాతీయ కౌన్సిల్ ఈ చట్టాన్ని ఆమోదించింది. దీని ప్రకారం, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, దుకాణాలు, రెస్టారెంట్లలో మహిళలు తమ ముఖాలను పూర్తిగా కప్పి ఉంచడం నిషేధించబడింది. బురఖా నిషేధానికి సంబంధించి స్విస్ ప్రభుత్వం విమానాల్లో లేదా దౌత్య, కాన్సులర్ ప్రాంగణాల్లో బురఖా నిషేధం వర్తించదని స్పష్టం చేసింది. ఇది కాకుండా, మతపరమైన ప్రదేశాలు, ఇతర పవిత్ర ప్రదేశాలలో ఒక వ్యక్తి తన ముఖాన్ని కప్పుకోవడానికి కూడా అనుమతించబడతారు. ఆరోగ్యం, భద్రతా కారణాలు, సాంప్రదాయ ఆచారాలు లేదా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఫేస్ కవర్లు అనుమతించబడతాయని ప్రభుత్వం తెలిపింది. కళాత్మక లేదా వినోద కారణాలతో పాటు ప్రకటనల ప్రయోజనాల కోసం వారికి ఈ ఆమోదం మంజూరు చేసింది. సెప్టెంబరు 2022లో కొంతమంది ముస్లిం మహిళలు ధరించే బురఖా వంటి ముఖ కవచాలను నిషేధించాలని స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువ సభ ఓటు వేసింది. జాతీయ కౌన్సిల్ ఈ చట్టానికి వ్యతిరేకంగా 29 ఓట్లతో పోలిస్తే 151 ఓట్లతో ఆమోదించింది. అనేక ముస్లిం సంస్థల అభ్యంతరాలు ఉన్నప్పటికీ రైట్-వింగ్ స్విస్ పీపుల్స్ పార్టీ ఈ చట్టం కోసం ముందుకు వచ్చింది. ఇలా చేయడంలో స్విట్జర్లాండ్ మొదటి దేశం కాదు, ఐరోపాలోని బెల్జియం, డెన్మార్క్, ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ఇలాంటి ఆంక్షలు విధించాయి. అయితే, ఈ యూరోపియన్ దేశాలలో మత స్వేచ్ఛకు సంబంధించి చాలాసార్లు ప్రశ్నలు తలెత్తాయి. ప్రజా భద్రత పేరుతో చేసిన ఈ చట్టాల ద్వారా ముస్లిం మహిళలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.

# అందాల కశ్మీరం... మంచులో నిండిపాయెరా...

శ్రీనగర్, జనవరి 2, (న్యూస్ పల్స్) జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాలు మంచుమయం అయ్యాయి. ఎటువైపు చూసినా కనుచూపు మేరలో హిమపాతం దర్శనమిస్తోంది. మంచు దుప్పటి కప్పుకున్న కాశ్మీర్ అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడ చూసినా పర్యాటకుల సందడే కనిపిస్తోంది. అదే సమయంలో భారీ మంచు వర్షంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా.. రైల్వే ట్రాకులపై భారీగా మంచు పేరుకుపోవడంతో పలు ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ దెబ్బతింది. దీంతో.. స్నో కట్టర్ అమర్చిన లోకోమోటివ్ ద్వారా ట్రాక్ క్లియరెన్స్ పనులు కొనసాగిస్తున్నారు రైల్వే అధికారులు. ట్రాకులపై పేరుకుపోయిన మంచును తొలగించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. మంచు కారణంగా పలు ప్రాంతాల్లో రైలు సర్వీసులను నిలిపివేశారు. ఈ క్రమంలోనే.. శ్రీనగర్ రైల్వే స్టేషన్‌లో మంచు పెద్దయెత్తున కురుస్తుండడంతో రైల్వే ట్రాకులు మంచుతో నిండిపోయాయి. దాంతో.. అలెర్ట్ అయిన ఇండియన్ రైల్వే టీమ్.. స్నో కట్టర్లతో రంగంలోకి దిగింది. రైలు ఇంజిన్లకు స్నో కట్టర్‌లను అమర్చి ట్రాకులపై నిలిచిన మంచును తీసివేస్తున్నారు. కంటిన్యూ హిమపాతం ఉన్నప్పటికీ.. రైల్వే కనెక్టివిటీకి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. శ్రీనగర్ రైల్వే స్టేషన్‌లో లోకోమోటివ్ స్నోకట్టర్‌లతో మంచు తొలగిస్తున్న దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు.. ఎప్పటికప్పుడు మంచు తొలగిస్తుండడంతో జమ్మూ-శ్రీనగర్ హైవేపై వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇక.. మరో రెండు రోజులపాటు మంచు భారీగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో దట్టమైన మంచు కురుస్తుందని వెల్లడించింది. ఎల్లుండి నుంచి జనవరి 6 మధ్యలో కశ్మీర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ హిమపాతం కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఇదిలావుంటే.. న్యూ ఇయర్ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో మంచు అందాల మధ్య పర్యాటకులు ఎంజాయ్ చేశారు.

# బీటా బేబీస్ జనరేషన్

న్యూయార్క్, జనవరి 2, (న్యూస్ పల్స్) మనమందరం 2025లోకి అడుగుపెట్టేశాం. అయితే ఈ ఏడాదికి ఒక ప్రత్యేక ఉంది. ఇకనుంచి 2025 జనవరి ఒకటి నుంచి పుట్టేవారిని జనరేషన్ బీటాగా పిలవనున్నారు. 2025 నుంచి 2039 మధ్య జన్మించే తరాన్ని బీటా బేబిస్‌గా పిలవనున్నారు. అయితే ఈ బీటా జనరేషన్ టెక్నాలజీ యుగంలో పిల్లలు అత్యున్నతంగా ఎదుగుతారని నిపుణలు చెబుతున్నారు. అలాగే ఇంతకుముందున్న తరాలు ఎప్పుడూ చూడని సవాళ్లను ఎదుర్కొంటారని.. నూతన అవకాశాలు అందిపుచ్చుకుంటారని భావిస్తున్నారు. అయితే జనరేషన్ బీటా తరం 2035 నాటికి ప్రపంచ జనాభాలో 16 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఈ తరం 22వ శతాబ్దపు ప్రారంభానికి సాక్షంగా నిలుస్తారని చెబుతున్నారు. అంతేకాదు సాంకేతిక పరిణామాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), సామాజిక మార్పుల మధ్య బీటా తరం జీవితం గడుపుతుంది. అయితే ఈ తరం ప్రతి అంశంలో కూడా సాంకేతికతను వినియోగించడమే కాకుండా పర్యావరణ, సామాజిక సవాళ్లను కూడా ఎదుర్కోనుంది. ఇదిలాఉండగా.. 1981-1996 మధ్య పుట్టిన వాళ్లను మిలీనియల్స్ అని పిలుస్తారు. 1996 - 2010 మధ్య పుట్టినవారిని జెనరేషన్ జెడ్ అని అంటారు. 2010 నుంచి 2024 మధ్య పుట్టిన తరాన్ని అల్ఫా జనరేషన్‌గా పరిగణిస్తారు. ఇక 2025 నుంచి 2039 మధ్య పుట్టిన తరాన్ని బీటా బేబీస్‌గా పిలవనున్నారు. అయితే బీటా బేబీస్ తరంపై టెక్నాలజీ యుగం సామాజిక పరిశోధకుడు మార్క్ మెక్‌క్రిండిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనరేషన్ బీటా వారి జీవితాలు కృత్రిమ మేధా సాయంతోనే సాగుతాయని చెప్పారు. విద్య, ఆరోగ్యం, వినోదం, ఇతర విషయాల్లో వీళ్లు ఎక్కువగా ఏఐని వినియోగిస్తారని పేర్కొన్నారు

# నేడే తెలంగాణ కేబినెట్

హైదరాబాద్, జనవరి 2, ఈనెల 4న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులకు సమాచారం అందించారు. అవసరమైన సమాచారం సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై క్యాబినెట్ చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి నుంచి ఈ పథకం అమలు చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో వెల్లడించింది. ఈ మేరకు అర్హుల ఎంపిక, విధివిధానాల ఖరారు కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షణ కేబినెట్ సబ్ కమిటీ కూడా ఏర్పాటు చేసింది. రెండ్రోజుల క్రితం సమావేశమైన కేబినెట్ సబ్ కమిటీ అర్హుల ఎంపికై కసరత్తు చేసింది. ఈ మేరకు ఈనెల 4న జరిగే కేబినెట్ భేటీలో చర్చించి రైతు భరోసా పథకం అమలుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అనంతరం రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ. 15 వేలు జమ చేసేందుకు నిధులు విడుదల చేయనున్నారు. ఇక కొత్త రేషన్ కార్డులు కూడా మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రజా పాలన దరఖాస్తుల ద్వారా వచ్చిన అప్లికేషన్లు ఫిల్టర్ చేసి అర్హులైన వారికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. దాదాపు 30-40 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డులపైనా కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే కాకుండా రైతు కూలీలకు ప్రభుత్వం ప్రతి ఏడాది రూ. 12 వేలు ఇస్తామని ప్రకటించింది. డిసెంబర్ 28నే పథకం ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించినా.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో ఆ కార్యక్రమం వాయిదా పడింది. జనవరి నాలుగున జరిగే కేబినెట్ భేటీలో ఈ అంశంపైనా చర్చించి రైతు కూలీల అకౌంట్లలో డబ్బులు జమ చేసే అంశంపై కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

ఇదే కాకుండా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక కమిషన్ నివేదిక, పలు పురపాలక సంఘాల్లో గ్రామాల విలీనం, ఎస్సీ వర్గీకరణ, నూతన టూరిజం పాలసీ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు, గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణలో భాగంగా గ్రామ స్థాయి అధికారుల నియామక ప్రక్రియ, అన్ని శాఖల్లో ఉన్న ఇతర పెండింగ్ అంశాలపై కేబినెట్ భేటీలో చర్చించే అవకాశం ఉంది.

## స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడుతో కూడిన అగ్ని ప్రమాదం,6 మందికి గాయాలు..?

పెళ్లకూరు మండలం పెన్నేపల్లిలో ఉన్న ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బుధవారం రాత్రి 10 గంటల 15 నిమిషాలకు భారీ పేలుడు సంబవించింది. భారీ శబ్దం తో కూడిన పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురై ఇంటి నుండి బయటకు పరుగులు తీశారు. ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బాయిలర్ అగ్ని ప్రమాదానికి గురవడంతో జరిగిన పేలుడు సంఘటనతో పెన్నేపల్లి గ్రామ ప్రజలు బిక్కు, బిక్కు మంటూ భయాందోళనలో ఉన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న ఆందోళన వారిని భయపెడుతుంది. పేలుడు సంభవించడంతో చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. భారీ పేలుడు సంభవించడంతో పరిశ్రమలోని పలువురికి గాయాలు అయినట్లు తెలిసింది. నెల్లూరు మరియు నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రులకు క్షతగాత్రులను తరలించడం జరిగింది,

# విద్యుత్ తీగలు తెగిపడి బస్సు దగ్ధం





అనంతపురం నగరంలో దివాకర్ బస్సుల ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ వద్ద 11 కేవీ విద్యుత్తు తీగలు ప్రమాదవశాత్తు తెగిపోయి బస్సు మీద పడడంతో బస్సు పూర్తిగా కాలిపోయింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల భయభ్రాంతులకు గురయ్యారు. సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకున్నారు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకోవడంతో నగరంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

# ఎమ్మెల్యేల ప్రోగ్రెస్ రిపోర్ట్...

హైదరాబాద్, జనవరి 2, (న్యూస్ పలతెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి న్యూ ఇయర్ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రభుత్వ, పార్టీపరమైన అంశాలపై కీలక సూచనలు జారీ చేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇకపై తాను ఎక్కువ సమయం పార్టీ నాయకులకు కేటాయించనున్నట్లు, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. న్యూ ఇయర్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు తరలివచ్చారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి నివాసం సందడిగా మారింది. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే రిపోర్ట్ లు తన వద్ద ఉన్నాయని, అలాగే తన రిపోర్టు కూడా తాను తెప్పించుకున్నట్లు సీఎం అన్నారు. ఎవరి ప్రోగ్రెస్ రిపోర్టు వారికి అప్పగించడం జరుగుతుందని, ప్రజలకు ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. ఏడాది పాలనలో తెలిసి తప్పు చేయలేదని, తెలియకుండా జరిగిన తప్పులపై చర్యలు తీసుకున్నామంటూ సీఎం అన్నారు. ఏడాది పాలనలో ఎన్నికల కోడ్ రావడంతో పూర్తిస్థాయి పాలన ఆరు నెలలు సాగినట్లుగా భావించాలని, కేవలం ఆరు నెలల్లో ప్రజా మద్దతును తమ ప్రభుత్వం సాధించిందన్నారు. ఏడాది పాలన అనుభవాలు, వచ్చే నాలుగేళ్లకు ఉపయోగపడతాయని, ప్రజా ప్రభుత్వంగా మన ప్రభుత్వం గుర్తింపు పొందేలా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సీఎం సూచించారు. ఈ దశలో అంగన్వాడీ, డీలర్ల నియామకంలో పార్టీ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఓ మంత్రి కోరగా, ఆ విషయాన్ని సీఎం తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఆన్లైన్లో దరఖాస్తులు తీసుకొని, పారదర్శకంగా నియామకాలు చేపట్టకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టేందుకు సాహసించలేదని, తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సాగించిందన్నారు. ఇకపై పార్టీ నాయకులకు ఎక్కువ సమయం కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా కీలకమంటూ ప్రజా ప్రతినిధులకు సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రతి విషయం గురించి తన వద్ద సమాచారం ఉందని, పార్టీ బలోపేతానికి కూడా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారుతెలంగాణలో మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టినట్లు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని కూడా సీఎం అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు గుర్తించి ప్రభుత్వ ఇబ్బందులను అర్థం చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరు తమ పనితీరును మరింతగా మెరుగుపరుచుకుని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మద్దతు కూడబెట్టుకోవాలని సీఎం తెలిపారు.

# కారు గేరు మారుస్తారా...

హైదరాబాద్, జనవరి 2, బీఆర్ఎస్ అధినేత గత ఏడాది ఎక్కడా కనిపించలేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రచారానికి వచ్చారు. అన్ని జిల్లాల్లో పర్యటించారు. అయితే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ సాధించలేకపోయింది. దీంతో కేసీఆర్ నాటి నుంచి ఎర్రవెల్లి లోని ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. ఎవరైనా ఆయనను కలవాలనుకున్నాఅక్కడకు వెళ్లాల్సిందే. తప్పఆయన బయటకు రావడం లేదు. ఇటీవల మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించినా ఫాం హౌస్ నుంచి ఒక సంతాప ప్రకటన అయితే పంపారు తప్ప ఆయన మాత్రం బయటకు రాలేదు. నిజానికి మన్మోహన్ సింగ్ తో ఉన్నఅనుబంధంతో ఆయన ఢిల్లీకి వెళ్లి నివాళులర్పించాల్సిన తరుణంలో ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. మరొకవైపు అసెంబ్లీ సమావేశాలకు కూడా దూరంగా ఉన్నారు. బడ్జెట్ సమావేశాలకు రాలేదు. సరే..ఇటీవల మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపేందుకు ప్రత్యేకంగా సమావేశమైన సభకు కూడా కేసీఆర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. తనకు మన్మోహన్ సింగ్ తో ఉన్న అనుబంధం ఆయన తన నోటి నుంచి చెప్పి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అందరిలో ఉన్నా దూరంగానే ఉన్నారు. ఇక తెలంగాణలో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఆయనపై ఇటు ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతుంది. మరోవైపు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు. ఈడీ అధికారులు అయితే ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఏసీబీ అధికారులు కూడా ఈ కేసులో విచారించే అవకాశాలున్నాయి. అంతే కాదు అరెస్ట్ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అంతా తానే అయి ఇన్ని రోజులు కార్యకర్తలకు భరోసాగా ఉన్న కేటీఆర్ కు నోటీసులు వచ్చిన సమయంలోనైనా కేసీఆర్ బయటకు రాకపోవడం గులాబీ పార్టీలో చర్చనీయాంశమైంది. అసలు కేసీఆర్ కు జనంలో తిరిగే ఆలోచన ఉందా? లేదా? అన్నది కూడా పార్టీలో తెలియకుండా ఉంది. కేసీఆర్ బయటకు వచ్చి జనంలో తిరిగితే కార్యకర్తలకు కూడా ధైర్యం కలుగుతుందని తెలిసినా ఫాం హౌస్ కే పరిమితమవ్వడమేంటన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. ఎర్రవెల్లి ఫాం హౌస్ లో కేసీఆర్ కేవలం వ్యవసాయ పనులు చూసుకుంటూ గడిపేస్తున్నారు. కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపేందుకు కూడా అక్కడకు నేతలకు వెళ్లాల్సిన పరిస్థితి. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని, రైతులకు ఇంత వరకూ భరోసా అందలేదని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ సమయంలో కేసీఆర్ వచ్చి కనీసం మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఇటు ప్రజల్లోనూ , అటు కార్యకర్తల్లోనూ ధైర్యం కలుగుతుందని, కానీ కనీసం ఆ పని కూడా చేయకపోతే ఎలా? అన్న ప్రశ్నలు గులాబీ పార్టీ నుంచి వినపడుతున్నాయి. అనేక మంది పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నా కేసీఆర్ బయటకు రాకపోవడంపై పార్టీలోనే ఒకింత నిరాశ నిస్పృహలు బయలుదేరాయి.

# రైతు భరోసా... సెల్ఫ్ డిక్లరేషన్

హైదరాబాద్, జనవరి 2, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఈ నెలలోనే అమలు చేయడానికి సిద్ధమయింది. సంక్రాంతికి రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేయడంతో అందుకు తగినట్లుగా విధివిధానాలను నిర్ణయించే పనిలో ఇటు అధికారులు, అటు మంత్రి వర్గ ఉప సంఘం ఉంది. అయితే ఇప్పటికే కొన్ని విధివిధానాలు ఖరారయ్యాయని చెబుతున్నారు. సంక్రాంతి నుంచి విడతల వారీగా నిధులను జమ చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుంది. తొలి విడత నిధులను 7,500 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్లాన్ చేస్తుంది. అయితే సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా ను తొలుత విడుదల చేయాలన్న ఆలోచనలో ఉంది.. అదే సమయంలో కొన్ని ముఖ్యమైన నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలిసింది. రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్న షరతు విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. తన భూమిలో ఏ పంటను సాగు చేస్తున్న విషయాన్ని రైతు డిక్లరేషన్ ద్వారా తెలియాచేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఎంత మేరకు రైతు సాగు చేశారో అంత వరకే రైతు భరోసా నిధులు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించిందని, మంత్రి వర్గ ఉప సంఘం కూడా ఈ రకమైన ప్రతిపాదనకు ఓకే చెప్పిందన్న వార్తలు వస్తున్నాయి. ఏదో ఒక పంట వేసి భూమిని సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులను తొలుత జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల జరిగే మంత్రివర్గ సమావేశంలో... అదే సమయంలో మిగిలిన వారి విషయం తర్వాత ఆలోచించవచ్చని తెలిపింది. సాగు కాని భూములకు రైతు భరోసా నిధులు ఇవ్వడం అనవసరమన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. సాగు కాని భూములకు రైతు భరోసా నిధులను జమ చేస్తే అది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని రేవంత్ రెడ్డి కూడా అభిప్రాయపడుతున్నారు. శాటిలైట్, ఇమేజ్ రిమోట్ సెన్సింగ్ సాయంతో సాగు విస్తీర్ణంపై ఒక క్లారిటీ వస్తుందని, దాని ప్రకారమే నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. జనవరి 2 వతేదీన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశమై దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. ఈ నెల 4వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసా

# టాప్ గేర్ లో నార్త్ హైదరాబాద్

హైదరాబాద్, జనవరి 2, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయంతో హైదరాబాద్ లోని ఉత్తర ప్రాంతంలో ఉన్న భూముల ధరలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో ధరలు ఆకాశాన్నంటాయి. తాజాగా తీసుకున్న నిర్ణయంతో ధరలు మరింత పెరిగే అవకాశముందని తెలిసింది. మేడ్చల్, కొంపల్లి, శామీర్ పేట్ వరకూ భూముల ధరలకు ఇక రెక్కలు వస్తాయి. అందుకు ప్రధాన కారణం మెట్రో రైలు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమే. ఇప్పటికే ఈ ప్రాంతం విస్తరించింది. దాదాపు మేడ్చల్ వరకూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేశారు. అనేక చోట్ల ఈ ప్రాంతంలో వేసిన వెంచర్లు అలాగే ఉన్నాయి. అమ్ముడు పోవడం లేదు. సిటీకి రావాలంటే కష్టంగా మారడం వల్లనే ఈ ప్రాంతంలో కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. . కొత్త సంవత్సరం తొలి రోజు హైదరాబాద్ వాసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. మెట్రో రైలును మేడ్చల్ వరకూ పొడిగించాలని నిర్ణయించారు.ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ కారిడార్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని ఆదేశించారు. డీపీఆర్ ను వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆమోదం పొందేందుకు ప్రయత్నిస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ, షామీర్ పేట్ నుంచి జేబీఎస్ వరకూ వెంటనే రెండు కారిడార్లకు సంబంధించిన డీపీఆర్ లను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో నార్త్ హైదరాబాద్ లో ఉంటున్న వారికి నిజంగా ఇది అమలయ్యేతే కొత్త సంవత్సరం వేళ శుభవార్తే అవుతుంది.. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేయాలంటే సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు ముందుకు రావాలి. అయితే ఇక్కడ నివాసం ఉండి మాదాపూర్, గచ్చిబౌలికి రావాలంటే గంటల తరబడి ప్రయాణం తప్పదు. రోడ్డు మార్గంలో రావాలంటే ట్రాఫిక్ చిక్కుల్లో పడక తప్పదు. అంత దూరంలో ఉండి గంటల తరబడి ఇళ్లకు చేరుకోవడం సాధ్యం కానిపని. కార్యాలయాలన్నీ ఇటు వైపు ఉండగా నగర శివార్లలో ఉత్తరం వైపు ఉన్న ఆ ప్రాంతం వైపు ఉన్న ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనపర్చడం లేదు. అయినా ఇప్పటికే కొంపల్లి నుంచి హైవే ఉన్నందున కొంత మేర అక్కడ అభివృద్ధి ప్రారంభమయింది. చాలా డెవలప్ అయింది. అనేక నిర్మాణాలు వెలిశాయి. కార్పొరేట్ సంస్థలు కూడా అక్కడ ఏర్పాటయ్యాయి. ఇక మెట్రో రైలు కూడా ఏర్పాటయితే ఇక అక్కడ భూముల ధరలు కొనలేని పరిస్థితి ఉంటుంది.... ఎప్పటి నుంచో మేడ్చల్ వైపు కనీసం కొంపల్లి వరకూ అయినా మెట్రో రైలును విస్తరించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వం ఇటువైపు చూపిన శ్రద్ధ అటు వైపు పెట్టలేదన్న ఆగ్రహంతో ఉన్నారు. అయినా గత ఎన్నికల్లో మేడ్చల్ ఇతర ప్రాంతాల్లో తిరిగి బీఆర్ఎస్ పార్టీనే గెలిపించారు. అయితే రేవంత్ రెడ్డి కొత్త ఏడాది తీసుకున్న నిర్ణయంతో తమ ట్రాఫిక్ కష్టాలు తీరతాయని భావిస్తున్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఖుషీ కబురు అందినట్లే ఫీలవుతున్నారు. మెట్రో రైలు ఏర్పాటయితే నగరం నడిబొడ్డుకు రాకపోకలు సాగించేందుకు సులువవుతుందని ఇక అమ్మకాలు ఊపందుకున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

శామీర్ పేటకు మెట్రో

మీర్ పేట్, మేడ్చల్ వరకు మెట్రో మార్గాలను పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. జేబీఎస్ నుండి శామీర్ పేట్ వరకు గల 22 కిలోమీటర్లు, ప్యారడైజ్ నుండి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్ల మెట్రో మార్గానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మెట్రో రైల్ ఫేజ్ ? 2 బి భాగంగా డీపీఆర్ తయారు చేయాలని సీఎం మెట్రో అధికారులకు ఆదేశాలిచ్చారు. సీఎం తీసుకున్న నిర్ణయం పై మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.ఇప్పటికే హైదరాబాద్ నగరంలో రెండవ దశ మెట్రో రైల్ మార్గాలను నిర్మించేందుకు మెట్రో సిద్ధమైంది. ఈ దశలో మేడ్చల్ వరకు కూడా మెట్రో మార్గాన్ని పెంచాలని సీఎం నిర్ణయం తీసుకోవడం పట్ల నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఓరుగల్లు కమలానికి కష్టాలు...

వరంగల్, జనవరి 2, ఓరుగల్లు జిల్లా నేతల తీరు తలనొప్పిగా మారిందట. అంతర్గత వర్గపోరుతో క్యాడర్‌ను చేజార్చుకుంటున్న నేతలు ఇప్పుడు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అధిష్టానానికి లేఖలు సంధిస్తున్నారట. దీంతో ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారట కాషాయ పెద్దలు. దేశవ్యాప్తంగా బలాన్ని పెంచుకునేందుకు బిజెపి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం కోసం పావులు కదుపుతోంది పార్టీ తప్పిదాలు, అంతర్గత కుమ్ములాటల కారణంగా బలహీనపడుతున్నామని తెలుసుకున్న అదిష్టానం.. మొదటగా పార్టీలో నూతన కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. బూత్ స్థాయి కమిటీల నిర్మాణం పూర్తికాగా.. మండల, జిల్లా స్థాయి కమిటీలను జనవరి మొదటి వారంలో ప్రకటించనుంది. క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే కమిటీల ఏర్పాటుకు సంబంధించి వర్గ పోరు తరాస్థాయికి చేరుతోంది. నేతల మధ్య వర్గపోరు కారణంగా తమ తమ అనుచరులకే కమిటీలలో అవకాశం కల్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో పార్టీ కోసం కష్టపడ్డ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది.ప్రస్తుత హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా ఉన్న రావు పద్మకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా నేతలంతా ఒక్కటయ్యారు. వరుసగా మూడుసార్లు అధ్యక్షురాలుగా పనిచేసిన రావు పద్మపై బిజెపిలోని మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలంతా గుర్రుగా ఉన్నారు. రావు పద్మ సీనియర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వట్లేదని ఆరోపణలు ఉన్నాయి. అందుకే రావు పద్మను కాదని మిగతా నేతలంతా ఒక్కటై పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జిల్లా అధ్యక్షురాలి పదవిలో ఉండి నేతలందరినీ కలుపుకోవాల్సిన ఆమె, వర్గాలను పెంచి పోషించారని బహిరంగంగానే బిజెపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి. కేంద్రంలో ఉన్న బిజెపి హనుమకొండకు చేసిన అభివృద్ధి పనులను సైతం ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తీవ్రంగా విఫలమయ్యారని బీజేపీ నేతలు విమర్శిస్తున్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, స్మార్ట్ సిటీ నిధులు బిజెపి ప్రకటిస్తే, ఈ విషయాలను కనీసం ప్రజల్లోకి తీసుకెళ్లలేదని మండిపడుతున్నారు.అన్ని జిల్లాలలో బీజేపీ పార్టీ కార్యాలయాలు ఉండగా, హనుమకొండ జిల్లాలో మాత్రం రావు పద్మ సొంత భవనంలో పార్టీ కార్యాలయాన్ని నడుపుతున్నారు. దీంతో రావు పద్మ వ్యతిరేకిస్తున్న కీలక నేతలంతా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మరికొంతమంది వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో బీజేపీ పార్టీ కార్యాలయాలు నిర్మాణం జరిగింది కానీ.. హనుమకొండ జిల్లాలో మాత్రం ఆ నిధులను జిల్లా అధ్యక్షురాలు వాడుకున్నారని ఆరోపిస్తున్నారు కాషాయ నేతలు. మూడు సార్లు జిల్లా అధ్యక్ష పదవిలో కొనసాగినప్పటికీ, పార్టీ కార్యాలయాన్ని ఎందుకు నిర్మించలేకపోయారని మండిపడుతున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మరో అభ్యర్థికి టికెట్ ఇచ్చి ఉంటే గెలిచే అవకాశాలు ఉండేవని, రావు పద్మకు టికెట్ కేటాయించడంతో బిజెపి శ్రేణులే వ్యతిరేకించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. రావు పద్మ కారణంగా పార్టీ తీవ్రంగా డ్యామేజ్ అవుతోందని, ఆమెను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని అధిష్టానానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు సైతం వెళ్లాయి. అయినా అధిష్టానం ఎటువంటి చర్యలు తీసుకోలేదు.బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం నాంపెల్లి శ్రీనివాస్, సంతోష్ రెడ్డి, రావుల కిషన్, గుజ్జుల వసంత, మరికొంత మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే తన వర్గానికి చెందిన వ్యక్తికే జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని రావు పద్మ అధిష్టానం పై ఒత్తిడి తెస్తున్నారంట. ఆ క్రమంలో రావు పద్మ అనుచరులకు పదవి దక్కకుండా ఇతర నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారట. వచ్చే ఎన్నికల్లో హనుమకొండలో బిజెపి జెండా ఎగురుతుందని, అందుకే అధ్యక్ష పదవి ఎంపికలో ఆచితూచి వ్యవహరించాలని అధిష్టానానికి కొంతమంది నేతలు లేఖలు రాసారట. ఇన్నేళ్లు పార్టీ కోసం కష్టపడ్డ వారిని రావు పద్మ పట్టించుకోలేదని, ఆమె కారణంగానే పార్టీ బలహీనపడుతోందని సీనియర్లు విమర్శిస్తున్నారు. ఒకవేళ ఈ సారి కూడా పార్టీ పదవి ఆమె అనుచరులకే ఇస్తే.. పార్టీని వీడాల్సి వస్తుందని పద్మ వ్యతిరేకులు హెచ్చరిస్తున్నారు.

## ఉత్తర తెలంగాణలో.. ఎన్నికల సందడి

కరీంనగర్, జనవరి 2, త్వరలో జరగనున్న ఉత్తర తెలంగాణలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది, థర్డ్ జెండర్లు ముగ్గురు ఉండగా ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది ఉన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ కసరత్తు చేస్తున్న క్రమంలో ఇప్పటికే రెండు సార్లు ఓటర్ నమోదుకు అవకాశమిచ్చింది. తుది జాబితాను ప్రకటించి ఇదే జాబితాతో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓటర్ల సంఖ్య క్రమంలో పట్టభద్రులకు సంబంధించి 499 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్లకు 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.ఓటరు నమోదులో కరీంనగర్ టాప్ లో నిలిచింది. పట్టభద్రులు, టీచర్ ఓటరు నమోదులో రెండింటిలో కరీనీనగర్ జిల్లా వారే ఎక్కువ మంది ఉన్నారు. పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 15 జిల్లాలుండగా పట్టభద్రుల ఓటరు నమోదులో కరీంనగర్ జిల్లాలో 69,657 మంది అత్యధిక సంఖ్యలో ఓటరుగా నమోదు కాగా అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేవలం 2,420 మంది మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవడం విశేషం.ఉపాధ్యాయ ఓటరు నమోదులో 4,020 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా అతి తక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 81మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. నిజామాబాద్, సిద్దిపేట జిల్లాలు కరీంనగర్ తరువాత స్థానాల్లో నిలువగా ఇతర జిల్లాలో నమోదు అంతంతమాత్రమే. సాధారణ ఓటరు జాబితాలో మహిళల ఆధిక్యం ఉండగా ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పురుష సంఖ్యకు సగానికి ఉండటం గమనార్హం.ఈ ఏడాది సెప్టెంబరు 30న ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమై నవంబరు 6వ తేదీ వరకు కొనసాగింది. దీంతో పట్టభద్రులు 3,58,579 మంది ఓటును నమోదు చేసుకోగా, ఉపాధ్యాయులు 27,994 మంది ఓటును పొందడానికి ఉత్సాహాన్ని చూపించారు. తిరిగి నవంబర్ 23వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు కొత్తగా నమోదుతో పాటు అభ్యంతరాలకు సమయం ఇవ్వడంతో కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి పలువురు ముందుకొచ్చారుపక్షం రోజుల వ్యవధిలో పట్టభద్రులవి 28,111 ధరఖాస్తులు కొత్తగా చేరగా.. ఉపాధ్యాయుల పరంగా అదనంగా 5,054 మంది ఆసక్తిని చూపించారు. దీంతో మొత్తంగా పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తుల సంఖ్య 3,86,690కి చేరింది. ఉపాధ్యాయ ఓటర్ల దరఖాస్తుల సంఖ్య 33,048కి పెరిగింది. మలి విడతలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను డిసెంబర్ 10 నుంచి పరిశీలించగా చాలా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. పక్కాగా ఉన్న వాటిని మాత్రమే ఆమోదం తెలిపి తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. ఇంకా ఎవరైనా నమోదు చేసుకునేవారుంటే షెడ్యూల్ వెలువడ్డాక నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యేవరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించనున్నది.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని బిఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ గా పోటీ చేసేందుకు సిద్దమైన సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు. ఒక్కరి పేరు రెండు మూడు చోట్ల నమోదు అయిందని, అత్యధికంగా 8 చోట్ల ఓటర్ జాబితాలో ఉందన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు విడుదల చేశారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆధార్ ఆధారంగా పట్టభద్రుల ఓటర్ల జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు.

# ఏడాది నుంచి ఇదిగో... అదిగో,,,
# రేషన్ కార్డులు ఎప్పుడు

అదిలాబాద్, జనవరి 2, రేషన్ కార్డుల జారీపై తెలంగాణలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే కొత్త కార్డుల జారీ పలుమార్లు వాయిదా పడటంతో ఆశావహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో రేషన్ కార్డుల జారీపై ప్రకటనలు జారీ చేస్తూ వాయిదా వేస్తూ కేవలం రెండుసార్లు మాత్రమే స్వల్ప సంఖ్యలో రేషన్ కార్డులు అందించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2016 నుంచి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం 2019లో కొన్ని కార్డులు అందించి ఆ వెబ్‌సైట్ మూసివేసింది.ఇదే తీరున కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సంక్రాంతి పండుగ సైతం రేషన్ కార్డులు అందజేయకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్ర ప్రభావం చూపుతోందనే వాదనలు ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు ప్రకారం జిల్లాలోని సివిల్ సప్లై శాఖ కొత్త రేషన్ కార్డులు జారీకి సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల నుండి అధికారులు అర్హుల జాబితాలను పరిశీలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల ప్రకారం గా అర్హుల ఎంపికను చేపడుతోంది. కొత్త నిబంధనలు దేశంలోని పలు రాష్ట్రాల్లో గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేరళ,, మహారాష్ట్ర, పంజాబ్ లలో ఏ విధంగా లబ్ధిదారులను ఎంపిక చేశారో అదే రీతిన మన తెలంగాణ ప్రభుత్వం సైతం నిబంధనల మార్పులు చేసినట్టు తెలుస్తుంది.ప్రజా సంక్షేమలో భాగంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుంది, ప్రభుత్వం నుంచి పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కనీస అర్హత రేషన్ కార్డు ఆధార్ కార్డు కలిగి ఉండాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో కొత్త రేషన్ కార్డులు లేకపోవడంతో అర్హులైన వారికి కూడా అనర్హతకు గురవుతున్నారు.రేషన్ కార్డులో గల్లంతయిన పేర్లు, కొత్తగా జన్మించిన పేర్లు, పెళ్లి చేసుకున్న వారి పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అయితే ఇటీవల ప్రజా పాలనలో భాగంగా సంక్షేమ పథకాలు లబ్ధి కోసం..రేషన్ కార్డుల దరఖాస్తుల కూడా స్వీకరించారు. ఇప్పటివరకు రేషన్ కార్డులు జారీ చేయలేదు.ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభల్లో సమావేశాలు సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనట్లు మంత్రి ఉత్తరం కుమార్ రెడ్డి ప్రకటించారు. దీంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి, కానీ కార్డుల జారిపై మారదర్శకాలు నిబంధనలపై స్పష్టత ఇవ్వలేదని పాత దరఖాస్తులు పరిగణలోకి తీసుకుంటారా? ప్రజాపాలనలో తీసుకున్న సమీకృత దరఖాస్తుల ఆధారంగా కార్డులు జారి చేస్తారా అనే సందేహం నెలకొంది.మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా అధికారులకు కసరత్తు చేస్తున్నారు, సర్పంచుల పదవీకాలం ముగిసి 11నెలలు కాకావస్తోంది, మరో నెల రోజులైతే పుర సంఘాల ఎన్నికలు రానున్నాయి. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు సన్నాఫ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల జాబితాను కూడా విడుదల చేశారు. నోడల్ అధికారులు సైతం నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రకటిస్తే తెల్ల రేషన్ కార్డులు సన్న బియ్యం పంపిణీకి బ్రేకులు పడ్డ ట్లేననే సందేహాలు ప్రజల్లో ఉన్నాయి.

## స్టీల్ ఫ్యాక్టరీ అగ్నిప్రమాదంపై గ్రామస్థుల మండిపాటు

తిరుపతి పన్నేపల్లి ఐరన్ స్టీల్ ఫ్యాక్టరీ అగ్నిప్రమాదంపై గ్రామస్తులు భగ్గుమంటున్నారు.ఫ్యాక్టరీ రసాయనాల కాలుష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇష్టానుసారంగా ఫ్యాక్టరీని విస్తరించి గ్రామం పై బూడిదకుమ్మరిస్తున్నారు. ఫ్యాక్టరీ కాలుష్యంపై ఎంతమందికి వినతులు సమర్పించినా ప్రయోజనం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడల్లా యాజమాన్యం గోప్యంగా ఉంచుతోంది. గత రాత్రి ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం భూకంపాన్నితలపించింది. పచ్చటి గ్రామంలో నిప్పులు వెదజల్లుతోంది. ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీ తో గ్రామానికి, పొలాలకు ముప్పు వాటిల్లుతుందని గ్రామస్తులు – తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జగిత్యాల నుంచే కవిత పోటీ...?



కరీంనగర్, జనవరి 2, ఢిల్లి లిక్కర్ స్కాం లో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొన్నాళ్ళ మౌనం తరువాత ఇప్పుడు యాక్టివ్ అయిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకి వ్యతిరేకంగా పోరాటం చేస్తూనే శాసనమండలి సమావేశాల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదేసే ప్రయత్నం చేశారు. నిజామాబాద్ ఎంపీగా ఒక్కసారి గెలిచి, రెండు సార్లు ఓడిపోయిన కవిత తండ్రి ఆశీస్సులతో ప్రస్తుతం శాసనమండలి సభ్యురాలిగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమె అసెంబ్లీకి పోటీ చేస్తానంటున్నారంట.

బెయిల్ వచ్చాక ఇన్ని రోజులు మౌనమే అన్నింటికి సమాధానం అన్నట్లు వ్యవహరించిన కవిత ఇప్పుడు తనకి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన బతుకమ్మనే మరో సారి నమ్ముకొని మరోసారి తెలంగాణ సెంటిమెంట్ ని రగిల్చే పనిలో పడినట్లు కనిపిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లికి సంప్రదాయ రూపమిచ్చి.. సెక్రటేరియట్‌లో అధికారికంగా ప్రతిష్టించింది. అయితే తెలంగాణ తల్లి విగ్రహం చేతిలో బతుకమ్మ లేదని బీఆర్ఎస్ రచ్చ చేస్తుంది. తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు కవిత ఏ సెంటిమెంట్‌ని తన అస్త్రంగా రాజకీయాలకి వాడుకున్నారో.. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ని మరోసారి రగిలించే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ప్రభుత్వం ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని.. కాంగ్రెస్ తల్లి అంటూ నిరసనలు తెలుపుతూ? బతుకమ్మ లేని తెలంగాణ తల్లి ని ఒప్పుకోమని జగిత్యాల లో 20 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకి భూమిపూజ చేసారు. యితే జగిత్యాలలోనే ఆమె తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వెనుక ప్రత్యేక కారణాలు ఉన్నాయని బీఆర్ఎస్ శ్రేణులు, జాగృతి శ్రేణులు భావిస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కవిత జగిత్యాల నుండి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతుంది.ఇంకా ఎన్నికలకు నాలుగేళ్ల సమయం ఉండడంతో ఇప్పటి నుండే జగిత్యాల నియోజకవర్గం లో గ్రౌండ్ వర్క్ చేసుకుని జైత్రయాత్రకి సిద్ధమవ్వాలని భావిస్తున్నారంట. అందుకే తరుచుగా జగిత్యాల బీఆర్ఎస్ లీడర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని ఫిక్స్ అయ్యారంట. అందుకే మరోసారి తెలంగాణ సెంటిమెంట్ , తెలంగాణ తల్లి సెంటిమెంట్ ని రగిల్చేందుకు బతుకమ్మ తో కూడిన తెలంగాణ తల్లి ఏర్పాటుకు జగిత్యాలలోనే భూమిపూజ చేసారంట. అయితే ఆమె జగిత్యాలలో అంత యాక్టివ్ అయి. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం వెనుక మరో కారణం ఉందని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి.గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో జగిత్యాలలో అన్ని తానై తన అనుంగు అనుచరుడిగా పేరున్న సంజీవ్‌కుమార్‌ను కవిత గెలిపించుకున్నారు. ఆయన కాంగ్రెస్ లో చేరడాన్ని కవిత జీర్ణించుకోలేక పోతున్నారట. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న జగిత్యాలలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డిని టార్గెట్ చేసి ఆయనకు కవిత చెక్ పెట్టగలిగారు. జగిత్యాలలో కంటి వైద్యుడిగా మంచి పేరున్న డాక్టర్ సంజయ్ కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలబెట్టి అసెంబ్లీ ఎన్నికలలో ప్రచారం చేసి జీవన్‌రెడ్డిని ఓడిస్తానన్న ఛాలెంజ్‌ను నిలబెట్టుకున్నారు.2023 అసెంబ్లీ ఎన్నికల తరువాత ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో పాటుగా లిక్కర్ స్కాంలో కవిత అయిదునెలలు పైగా తీహార్ జైలుకు వెళ్లడంతో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ క్యాడర్ పూర్తిగా నైరాశ్యంలో మునిగిపోయింది. ఇటు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరిపోయారు. సంజయ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని బీఆర్ఎస్ క్యాడర్ ముఖ్యంగా కేటీఆర్, కవితలకు అస్సలు మింగుడు పడటం లేదంట.తనకి అనుంగ అనుచరుడుగా ఉన్న వెలమ సామాజిక వర్గానికి చెందిన సంజయ్‌కుమార్ కాంగ్రెస్ లో చేరడంతో ఆయన గెలుపు కోసం తాను పట్ట కష్టమంతా వృధా అయిందని కవిత ఫీలవుతున్నారంట. అందుకే జగిత్యాల నుండి తానే స్వయంగా బరిలోకి దిగి సంజయ్‌కుమార్‌ని ఓడించి జగిత్యాల గులాబీ పార్టీకి కంచుకోట అని నిరూపించాలని కంకణం కట్టుకున్నారంట. అందులో భాగంగా రానున్న రోజుల్లో జగిత్యాలలోనే మకాం వేసి కార్యక్రమాలు నిర్వహించేలా ప్లాన్ చేసుకుంటున్నారంట. మరి చూడాలి బెయిల్‌పై బయట తిరుగుతున్న కవిత ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో?

## బద్వేలు పట్టణ ప్రణాళిక అధికారులు,ప్లానింగ్ సెక్రటరీ లతో సమీక్షా సమావేశం నిర్వహించిన మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి

బద్వేలు కమీషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం పురపాలక కార్యాలయం నందు పట్టణ ప్రణాళిక విభాగము సంబంధించి ఓపెన్ ఫోరం సమావేశం నిర్వహించబడుననీ తెలిపారు. .ఈ సమావేశంలో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన ఇబ్బందులు గానీ,సందేహాలు గానీ నివృత్తి చేసుకోవచ్చు.అంతే గాకుండా పట్టణ అభివృద్ధి కొరకు మీచే తగు సూచనలు స్వీకరించడం జరుగుతుంది.కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారుబి .పట్టణ పరిధిలో గల నాలుగు మెయిన్ రోడ్డులలో మార్జిన్ ల మీదికి వచ్చేలా స్టెప్స్ ,రేకులు షెడ్ లు,ఆక్రమణ ద్వారా డ్రైనేజీ కాలువల పైకి కట్టడాలు తొలగించడం కొరకు నాలుగు టీంలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు× ఈ టీం వారు ఇదివరకే ఆక్రమణలు స్వచ్ఛంధంగా తొలగించుకోవాలని తెలిపారు బి .అలాంటి ఆక్రమణ కట్టడాలు కట్టిన వారు తక్షణమే స్వచ్ఛంధంగా మూడు రోజుల లోపల తొలగించుకోవలేను.లేనియెడల పురపాలక సిబ్బంది ద్వారా తొలగించడం జరుగుతుందనీ తెలిపారు×పురపాలక పరిధిలో అనుమతులు లేకుండాఎలాంటి కట్టడాలుకట్టరాదు.అనుమతి పత్రం పొందిన తర్వాత మాత్రమే నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు పురపాలక పరిధిలో అక్రమ కట్టడాలు కడితే మునిసిపల్ చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు× .ఈ సమీక్షా సమావేశంకు కమీషనర్ నరసింహారెడ్డి తో పాటు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, టి.పీ.బి.ఓ లు ప్లానింగ్ సెక్రటరీ లు మరియు పట్టణ ప్రణాళిక సిబ్బంది పాల్గొన్నారు

# సినిమా





## నిజమైన ప్రేమంటే ఇదే




జబర్దస్త్ లో ఆకట్టుకుంటున్న కమెడియన్స్‌లో సన్నీ ఒకరు. సుడిగాలి సుదీర్ టీమ్‌లో తన కామెడీతో ప్రేక్షకులను మెప్పిస్తున్నాడు సన్నీ. తన కామెడీతో .. పంచ్ లతో ప్రేక్షకులను ఆకట్టుకునే సన్నీ లైఫ్ లో విషాదం ఉన్న విషయం చాలా మందికి తెలియదు. సన్నీ ఎప్పుడూ తాగుబోతు క్యారెక్టర్స్ వేస్తూ ప్రేక్షకులను నవ్విస్తూ ఉంటాడు. కానీ అతని లైఫ్ లో ఓ విషాదం ఉంది. ఆస్తిపాస్తులు బాగా ఉన్నా కూడా ఓ అమ్మాయి కోసం లైఫ్ వదిలేసుకున్నాడు సన్నీ. ఇప్పటికీ ఆమెనే తలుచుకుంటూ.. లైఫ్ ను వదిలేశాడు సన్నీ. ఈ విషయాన్నీ తానే జబర్దస్త్ ఎపిసోడ్ లో చెప్పాడు. ప్రేమించిన అమ్మాయి మోసం చేయడంతో ప్రేమ, పెళ్లి పై నమ్మకం కోల్పోయి ఇప్పటికీ ఒంటరిగానే ఉంటున్నాడు సన్నీ. జబర్దస్త్ ఎపిసోడ్ లో యాంకర్ రష్మీ మీ లవ్ స్టోరీ గురించి చెప్పండి. ఇంతవరకు ఎందుకు పెళ్లి చేసుకోలేదు అని అడగ్గా.. సన్నీ మాట్లాడుతూ.. ఓ అమ్మాయిని ప్రేమించా.. ఎనిమిదేళ్లు ఇద్దరం ప్రేమించుకున్నాం. కానీ ఆ అమ్మాయి నన్ను వదిలేసి వేరేవాడిని పెళ్లి చేసుకుంది. గవర్నమెంట్ జాబ్ ఉందని అతన్ని పెళ్లి చేసుకుంది. మరో కమెడియన్ రామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. సన్నీ మంచి కోటీశ్వరుడు. బోలెడన్ని డబ్బులు ఉన్నాయి.. కానీ సన్నీ లవ్ ఫెయిల్ అవ్వడంతో పెళ్లి చేసుకోకుండా లైఫ్ ను వదిలేసుకున్నాడు. సన్నీ అన్న, వదిన ఇద్దరూ డాక్టర్స్.. అంత డబ్బున్నా వాడు వాళ్ళ ఇంట్లో ఉండడు.. మా రూమ్స్ కు వచ్చి తాగి పడుకుంటాడు. అమ్మాయి కోసం వాడు లైఫ్ నే వదిలేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్స్ ఎమోషనల్ గా కామెంట్స్ చేస్తున్నారు. ఇన్ని రోజులు వయసు అయిపోయి తాగుతున్నాడు అనుకున్నాం.. కానీ ఇంత బాధ ఉందా అన్న అని.. నిజంగా ప్రేమించే వాళ్ళు మాత్రం ఇలా సింగల్ గా ఉండిపోతారు అని కామెంట్స్ చేస్తున్నారు.

## రష్మిక ప్రేమాయణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన నిర్మాత నాగవంశీ




టాలీవుడ్ లో అగ్రనటిగా కొనసాగుతున్న రష్మిక మందన్న ఇప్పుడు నేషనల్ క్రష్ గా ఎదిగింది. 'పుష్ప 2'తో ఆమె కెరీర్ తార స్థాయికి చేరకుంది. మరోవైపు హీరో విజయ్ దేవరకొండతో రష్మిక రిలేషన్ లో ఉందనే ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతోంది. ఇద్దరూ పీకల్లోతు ప్రేమలో ఉన్నారని, పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనేది ఫిలిం నగర్ టాక్. రష్మిక ప్రేమ వ్యవహారంపై నిర్మాత నాగవంశీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాలకృష్ణ తాజా చిత్రం 'డాకూ మహారాజ్' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాకు నాగవంశీ నిర్మాతగా వ్యవహరించారు. బాబీ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా బాలకృష్ణ 'అన్ స్టాపబుల్' షోలో బాబీ, సంగీత దర్శకుడు తమన్, నాగవంశీ సందడి చేశారు.


## 3న 'దిల్‌రూబ' టీజర్





కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'దిల్‌రూబా'. విశ్వ కరుణ్ ఈ సినిమాని తెర కెక్కిస్తున్నారు. హీరోయిన్ రుక్సర్ ధిల్లాన్ ఈ చిత్రంతో టాలీవుడ్ ఇండిస్ట్రీకి పరిచయం కాబో తుంది. ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్ అండ్ సారెగమ నిర్మాణ సంస్థ 'ఏ యాడ్లీ ఫిల్మ్' సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ఫిబ్రవరిలో థియేటర్స్‌లో విడుదల కానుంది. తాజాగా, నూతన సంవత్సరం సందర్భంగా 'దిల్‌రూబా' మూవీ టీజర్ జనవరి 3న విడుదల కాబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కిరణ్ ప్రకటించారు. హీరోయిన్‌తో బీచ్‌లో సైకిల్ మీద చెట్టాపట్టా లేసుకుని తిరుగుతున్న పోస్టర్‌ను కూడా షేర్ చేశాడు.

## థ్రిల్ చేసే 'హిట్ 3'

'హిట్ 3' నాని నటిస్తున్న క్రైమ్, యాక్షన్ థ్రిల్లర్ 'హిట్: ది థర్డ్ కేస్'. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నాని యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కాశ్మీర్ షెడ్యూల్‌ను పూర్తి చేశారు మేకర్స్. తాజాగా విడుదలైన న్యూ ఇయర్ పోస్టర్‌లో నాని రా అండ్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. ఇంటెన్స్ ఎక్స్ ప్రెషన్ నాని పోషిస్తున్న అర్జున్ సర్కార్ పాత్ర ఫెరోషియస్ నేచర్‌ని తెలియజేస్తుంది. ఈ పోస్టర్ అర్జున్ సర్కార్ జర్నీ, అతని ట్రాన్స్‌పర్మేషన్ పై క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తోంది. మే 1న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది.



## '7/జి బృందావన కాలనీ 2' పోస్టర్ రిలీజ్




దక్షిణ భాషా చిత్రాలలో కల్ట్ క్లాసిక్ సినిమాగా నిలిచిన వాటిలో '7/జి బృందావన కాలనీ' చిత్రం ఒకటి. సినిమా విడుదలై రెండు దశాబ్దాలవుతున్నా, ఇప్పటికీ ఎందరికో అభిమాన చిత్రంగా ఉంది. అలాంటి కల్ట్ క్లాసిక్ చిత్రానికి సీక్వెల్‌గా '7జి బృందావన కాలనీ 2' రూపొందుతోంది. శ్రీ సూర్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేక్షకులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సీక్వెల్ చిత్రీకరణ తుది దశకు చేరుకుందని నూతన సంవత్సరం సందర్భంగా చిత్ర బృందం ప్రకటించింది. '7/జి బృందావన కాలనీ 2' చిత్రానికి ప్రముఖ దర్శకుడు సెల్వరాఘవన్ దర్శకత్వం వహిస్తున్నారు. కట్టిపడేసే కథాకథనాలు, హత్తుకునే భావోద్వేగాలతో ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించేలా అద్భుతంగా ఈ సీక్వెల్ ను తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగంలో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల మనసు గెలిచిన రవికృష్ణ, మరోసారి తనదైన శైలిలో మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. ఆయన సరసన అనశ్వర రాజన్ నటిస్తున్నారు.

## స్టైలిష్ లుక్ లో టిల్లు..
## జాక్ పోస్టర్ విడుదల





డీజే టిల్లు ఫ్రాంచైజీ చిత్రాల బ్లాక్‌బస్టర్ తర్వాత స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తోన్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'జాక్ కొంచెం క్రాక్'. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్నారు. సరికొత్త జోనర్‌లో 'జాక్- కొంచెం క్రాక్' మూవీ రూపొందుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10న గ్రాండ్ లెవెల్లో రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో న్యూ ఇయర్ సందర్భంగా మేకర్స్ అందరికీ విషెష్ తెలియజేస్తూ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో స్టార్ బాయ్ సిద్ధు సింపుల్‌గానే కనిపిస్తున్నా స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు.

## రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో రామ్ చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్లపై దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని 'యు/ఎ' సర్టిఫికేట్‌ను పొందింది. గ్లోబల్ రేంజ్ ఇమేజ్ ఉన్న రామ్ చరణ్‌తో లార్జర్‌దెన్ లైఫ్ సినిమాలను రూపొందించే శంకర్ కలయికలో రాబోతున్న ఈ సినిమా ఎలా ఉండబోతుందనే విషయం అందరిలోనూ ఆసక్తిని పెంచుతోంది. మెగాభిమానులు, సినీ ప్రేక్షకులు సినిమాను ఎప్పుడెప్పుడు థియేటర్‌లో చూద్దామా అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గేమ్ చేంజర్ టీజర్, నాలుగు సాంగ్స్, వాటి మేకింగ్ చూస్తే వావ్ అనిపిస్తోంది. సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశానంటుతున్నాయి. గేమ్ చేంజర్‌ను ఎస్వీసీ, ఆదిత్యరామ్ మూవీస్ సంస్థలు తమిళంలో ప్రొడ్యూస్ చేస్తుండగా హిందీలో ఏఏ ఫిలిమ్స్ అనిల్ తడాని రిలీజ్ చేస్తున్నారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్.. గేమ్ చేంజర్ చిత్రంలో రెండు పవర్‌ఫుల్ పాత్రల్లో మెప్పించనున్నారు.

## మహేష్ బాబు అభిమానులకు గుడ్ న్యూస్



సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులకు గుడ్ న్యూస్.. రాజమౌళి, మహేశ్ మూవీ కాంబోలో తెరకెక్కనున్న ఎస్ఎస్ఎంబి29 సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందని ఎంతగానో ఎదురుచూస్తున్నారు అభిమానులు. అయితే, ఎట్టకేలకు ఫ్యాన్స్ ఎదురు చూపులకు ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా ఈ సినిమాపై అప్డేట్ వచ్చేసింది. రేపు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లో ఈ సినిమా లాంచ్ కానున్నట్లు తెలుస్తోంది. చిత్రయూనిట్ పూజా కార్యక్రమాలతో ఈ మూవీని ప్రారంభించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన నటీనటుల గురించి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. దీంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ.. ఇండియన్ సినిమా చరిత్రలో ఈ మూవీ సరికొత్త రికార్డు సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే, దీనిపై మేకర్స్ నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు.



# క్రీడలు



## కొత్త ఏడాది ఆరంభంలోనే ఊహించని షాకిచ్చిన స్టార్ ప్లేయర్..



రోహిత్ శర్మ త్వరలో టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవచ్చు అని వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో బంగ్లాదేశ్ జట్టులోనూ కీలక మార్పు చోటు చేసుకుంది. నజ్ముల్ హుస్సేన్ శాంటో టీ20 జట్టు కమాండ్ నుంచి తప్పుకున్నాడు. దీంతో తర్వాత కెప్టెన్ ఎవరంటూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు కెప్టెన్సీ నుంచి నజ్ముల్ హుస్సేన్ శాంటో తప్పుకున్నాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో శాంటో కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. అతను మూడు ఫార్మాట్లలో కెప్టెన్సీ నుంచి వైదొలగబోతున్నాడని వార్తలు వచ్చాయి. అయితే ప్రస్తుతం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అతనిని టీ20 కెప్టెన్సీ నుంచి మాత్రమే తప్పుకోవాలని ఒప్పించింది. ఇకపై టీ20 జట్టుకు నజ్ముల్ కెప్టెన్సీ వహించడం లేదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి ధృవీకరించారు. 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలని నజ్ముల్ భావించాడు. అతని స్థానంలో లిటన్ దాస్ ఇప్పుడు టీ20 ఇంటర్నేషనల్‌లో బంగ్లాదేశ్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా మారవచ్చని నివేదికలు వస్తున్నాయి. ప్రస్తుతం టీ20 కెప్టెన్సీ నుంచి శాంటో తప్పుకుంటున్నట్లు బంగ్లాదేశ్ బోర్డు తెలిపింది. రాబోయే కాలంలో టీ20 సిరీస్ లేదు. కాబట్టి కొత్త టీ20 కెప్టెన్‌ని ప్రకటించడం లేదు. నజ్ముల్ హుస్సేన్ శాంటోతో గాయం సమస్య లేకుంటే టెస్టు, వన్డే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. బీసీబీ అధికారులు లిటన్ దాస్ పేరును తీసుకోలేదు. అయితే, ఈ ఆటగాడు శాంటో స్థానంలో కొత్త టీ20 కెప్టెన్‌గా ఉంటాడని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల, లిట్టన్ కెప్టెన్సీలో బంగ్లాదేశ్ టీ20 సిరీస్‌లో వెస్టిండీస్‌ను 3-0తో ఓడించింది.

## సిడ్నీ టెస్టులో టీమిండియా రికార్డులు చూస్తే షాకే..



సిడ్నీ గడ్డపై భారత జట్టు రికార్డు ఏమంత బాగా లేదు. ఈ మైదానంలో భారత్ ఎక్కువసార్లు ఓడిపోయింది. దీంతో భారత జట్టు చివరిసారిగా 1978లో విజయం సాధించింది. రేపటి నుంచి మొదలుకానున్న 5వ టెస్ట్‌లో భారత జట్టు తప్పక గెలవాల్సి ఉంది. ఈ క్రమంలో టీమిండియా రికార్డులు ఓసారి చూద్దాం. ఆస్ట్రేలియాపై టీమిండియా బలహీనంగా కనిపిస్తోంది. ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 2-1తో వెనుకంజలో ఉంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ప్రమాదం ఉంది. చివరి టెస్టులో టీమిండియా ఓడిపోతే భారత్‌కు ఫైనల్ ఆడడం చాలా కష్టం. జనవరి 3 నుంచి ఇరు జట్ల మధ్య 5వ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. భారత్ గత రెండు సార్లు బిజిటిని గెలుపొందుతూ వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సిడ్నీపై జరిగిన మ్యాచ్‌లో టీమిండియా గెలిచి టైటిల్‌ను నిలబెట్టుకోగలదా? లేదా చూడాలి. జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్సీలో పెర్త్ మైదానంలో టీమిండియా 295 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, అడిలైడ్‌లో పునరాగమనం చేసిన ఆస్ట్రేలియా 10 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. గాబ్బా మైదానంలో వర్షం కురవడంతో టీమిండియా ఓటమి నుంచి బయటపడింది. కానీ, మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా పూర్తిగా టీమిండియాను వెనక్కి నెట్టి బాక్సింగ్ డే టెస్టును 184 పరుగుల తేడాతో చేజిక్కించుకుంది. అయితే, ఇప్పుడు సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో కంగారూలపై టీమిండియా ప్రతీకారం తీర్చుకుంటుందా అనేది ప్రశ్నగా మారింది. ఇటువంటి పరిస్థితిలో, ఈ మైదానంలో ఏ జట్టు పైచేయి సాధించిందో తెలుసుకుందాం. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో భారత్ రికార్డు బాగా లేదు. అందుకే నాలుగు టెస్టులు గెలిచిన మెల్‌బోర్న్‌లో భారత జట్టుకు విజయం అవసరం. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన 13 టెస్టుల్లో భారత్ ఒక విజయం సాధించగా, ఐదు ఓడిపోయింది. ఏడు మ్యాచ్‌లను డ్రా అయింది. భారత జట్టు ఏకైక విజయం జనవరి 1978లో, బిషన్ సింగ్ బేడీ జట్టు బాబ్ సింప్సన్ జట్టును ఇన్నింగ్స్ రెండు పరుగుల తేడాతో ఓడించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 131 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్, గుండప్ప విశ్వనాథ్, కర్సన్ ఘావ్రీల హాఫ్ సెంచరీల సాయంతో 265 పరుగుల ఆధిక్యం సాధించింది. ఫాలోఆన్‌కు వచ్చిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో ఎరపల్లి ప్రసన్న నాలుగు వికెట్లు పడగొట్టడంతో 263 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో భగవత్ చంద్రశేఖర్, బేడీలు నాలుగు, మూడు వికెట్లు తీశారు.


## 2025లో టీమిండియా బిజీ.. బిజీ.. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో సిరీస్..



2025 ఏడాదిలో టీమిండియా బిజీ.. బిజీ.. షెడ్యూల్‌తో గడపనుంది. ఫిబ్రవరిలో పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా జట్టు స్వదేశంలో జనవరి 22నుంచి ఇంగ్లండ్‌తో వన్డే, టి20 సిరీస్‌లకు సిద్ధమైంది. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే ఫార్మాట్‌లో జరగనున్న దృష్ట్యా ఇంగ్లండ్‌తోనూ మూడు వన్డేల సిరీస్‌ను భారత్ సిద్ధం చేసింది. ఈ షెడ్యూల్‌కు ఇరుదేశాల క్రికెట్‌బోర్డులు ఇప్పటికే అంగీకారం తెలిపాయి. ఆ తర్వాత టీమిండియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు అర్హత సాధిస్తే.. అది జూన్‌లో లార్డ్స్ వేదికగా ఉంటుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బాక్సింగ్ డే టెస్ట్‌లో ఓడిన టీమిండియా.. 11ఏళ్ల తర్వాత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కు మరోసారి చేరే ఛాన్స్‌ను కోల్పోయే ప్రమాదంలో పడింది. ఈ క్రమంలోనే దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యుటిసి ఫైనల్స్‌కు ఇప్పటికే అర్హత సాధించగా.. రెండో బెర్త్ కోసం ఆస్ట్రేలియా, భారత్, శ్రీలంక జట్లు రేసులో ఉన్నాయి. సిడ్నీ వేదికగా జనవరి 3 నుంచి ఆస్ట్రేలియాతో ఐదో, చివరి టెస్ట్‌లో భారత్ ఆడనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబారు వేదికగా జరగనున్నాయి. పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చే ఈ టోర్నీలో టీమిండియా ఒకవేళ నాకౌట్‌కు చేరితే ఆ మ్యాచ్‌లు కూడా దుబారులోనే ఉంటాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన పిమ్మట భారత్ వేదికగా ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్ మార్చి 14నుంచి ప్రారంభం కానుంది. ఆ తర్వాత టీమిండియా జూన్-ఆగస్ట్‌లో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు టిలు, మరో మూడు వన్డేల్లో.. అక్టోబర్ 25నుంచి స్వదేశంలో వెస్టిండీస్‌తో రెండు టెస్ట్ మ్యాచ్‌ల ఆడాల్సి ఉంటుంది.

## ఒకే ఓవర్‌లో అత్యధిక బంతులు విసిరిన ఐదుగురు..

క్రికెట్ చరిత్రలో ఎన్నో చెత్త రికార్డులు ఉన్నాయి. ఇందులో చేరాలని ఏ ఒక్కరూ కోరుకోరు. అయితే, కొందరు మాత్రం ఊహించని విధంగా ఈ చెత్త రికార్డులను తమ ఖాతాలో వేసుకుంటుంటారు. ఈ క్రమంలో ఒక ఓవర్‌లో అత్యధిక బంతులు విసిరిన చెత్త రికార్డును ఎవరో సొంతం చేసుకున్నారో ఓసారి చూద్దాం. క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌కి రనౌట్ కావడం అత్యంత విషాదరకంగా మారుతుంది. అదేవిధంగా బౌలర్‌కు, ఓవర్‌లో 6 కంటే ఎక్కువ బంతులు వేయడం ఇబ్బందికరమైన పరిస్థితిగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. క్రికెట్ చరిత్రలో, ఒక ఓవర్‌లో అత్యధిక బంతులు వేసిన వారి జాబితాలో ఐదుగురు బౌలర్లు ఉన్నారు. 1. బెర్ట్ వాన్స్ (న్యూజిలాండ్): క్రికెట్ మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక బంతులు వేసిన ఆటగాడిగా న్యూజిలాండ్ స్పిన్నర్ బెర్ట్ వాన్స్ చెత్త రికార్డును సొంతం చేసుకున్నాడు. 20 ఫిబ్రవరి 1990న, న్యూజిలాండ్ స్పిన్నర్ బెర్ట్ వాన్స్ వెల్లింగ్టన్ తరపున ఆడుతూ.. కాంటర్‌బరీతో జరిగిన ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో ఒక ఓవర్‌లో గరిష్టంగా 22 బంతులు విసిరాడు. ఈ ఓవర్‌లో 77 పరుగులు ఇచ్చాడు. 1990లో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో కాంటర్‌బరీ ప్లేయర్ లీ జర్మన్ ఒకే ఓవర్‌లో 70 పరుగులు సాధించాడు. కాగా, అతని సహచర ఆటగాడు రోజర్ ఫోర్డ్ 5 పరుగులు చేశాడు. 2. మహ్మద్ సమీ (పాకిస్థాన్): పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సమీ క్రికెట్ మ్యాచ్‌లో ఒక ఓవర్‌లో 17 బంతులు వేసిన చెత్త రికార్డును కలిగి ఉన్నాడు. 2004లో ఆసియా కప్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో మహ్మద్ సమీ ఒకే ఓవర్‌లో 17 బంతులు సంధించాడు. ఇందులో 7 వైడ్లు, 4 నో బాల్స్ ఉన్నాయి. 3. కర్ట్లీ ఆంబ్రోస్ (వెస్టిండీస్): వెస్టిండీస్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ కర్ట్లీ ఆంబ్రోస్ క్రికెట్ మ్యాచ్‌లో ఒక ఓవర్‌లో 15 బంతులు వేసిన రికార్డును కలిగి ఉన్నాడు. 1997లో పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో కర్ట్లీ ఆంబ్రోస్ ఒక ఓవర్‌లో మొత్తం 15 బంతులు వేశాడు. ఇందులో 9 నో బాల్స్ ఉన్నాయి. 4. డారెల్ టఫీ (న్యూజిలాండ్): 2005లో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే మ్యాచ్‌లో న్యూజిలాండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ డారెల్ టఫీ ఒకే ఓవర్‌లో 14 బంతులు సంధించాడు. ఇందులో 4 వైడ్ బాల్స్, 4 నో బాల్స్ ఉన్నాయి. 5. స్కాట్ బోస్వెల్ (ఇంగ్లండ్): ఇంగ్లండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోస్వెల్, 2001లో సీ అండ్ జీ ట్రోఫీ మ్యాచ్‌లో లీసెస్టర్‌షైర్ తరపున ఆడాడు. సోమర్‌సెట్‌తో జరిగిన సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో ఒక ఓవర్‌లో 14 బంతులు బౌలింగ్ సంధించాడు.



## నేటి నుంచి సిడ్నీ టెస్ట్ ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లతో టీమిండియా..!



బోర్డర్-గవాస్కర్ ట్రోపీలో 1-2 తేడాతో వెనుకబడ్డ టీమిండియా.. జనవరి 3 నుంచి సిడ్నీ వేదికగా చివరి టెస్ట్‌కు సిద్ధమైంది. చివరి టెస్ట్‌లో కాంబినేషన్ టీమిండియాకు సవాల్‌గా మారనుంది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ నాలుగో టెస్ట్‌కు దూరం కాగా.. ఐదో టెస్టుకు ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్స్‌తో బరిలోకి దిగాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. నాలుగో టెస్టులో ఓటమి తర్వాత టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ విమర్శలు ఎదుర్కొన్నాడు. ప్లేయింగ్-11 నుంచి గిల్‌ను తప్పించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీని టీమిండియా నిలబెట్టుకోవడంతో పాటు ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ రేసులో నిలవాలంటే.. రోహిత్ జట్టుకు బెస్ట్ ఆప్షన్స్‌ను ఎంచుకోవాల్సి ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత కెప్టెన్ సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో తన ఆరుగురు అత్యుత్తమ బ్యాట్స్‌మెన్స్‌ను రంగంలోకి దించాల్సిందేనని చెబుతున్నారు. ఇదే జరిగితే మెల్‌బోర్న్ టెస్టుకు దూరమైన శుభ్‌మన్ గిల్‌కు సిడ్నీ టెస్ట్ తుది జట్టులో చోటు దక్కేందుకు మార్గం సుగమం అయినట్లే..!

## వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 02 :** వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా రవాణా అధికారి సంతోష్కుమార్ తో కలిసి రోడ్డు భద్రతా మాసోత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు, ఇతర వాహనాల చోధకులు సీట్బెల్ట్ తప్పనిసరిగా పాటించాలని, కూడళ్ళ వద్ద సిగ్నల్లు తప్పనిసరిగా అనుసరించాలని, నియంత్రిత వేగంతో వాహనాన్ని నడపాలని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడుపకూడదని, వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటుందని, వేగ నిరోధకాలతో పాటు వాహనదారులు అర్థమయ్యే విధంగా ప్రమాద ప్రాంతాలు, మూలమలుపు ఇతర అన్ని ప్రాంతాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా రవాణా శాఖ నుండి సేవలను మరింత వేగంగా అందించడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతా నియమ, నిబంధనలను వివరిస్తూ ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధించిన అధికారులకు తదితరులు పాల్గొన్నారు

## సహకార సంఘాలు రైతుల పరపతిని పెంచి ఆర్థికంగా పరిపుష్టం కావాలి

### జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 02 :** సహకార సంఘాలు రైతుల పరపతిని పెంచి ఆర్థికంగా పరిపుష్టం కావాలని, రైతులకు విశిష్టమైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రాథమిక వ్యవసాయ సహాయక సంఘాల పునర్విభజన అంశంపై జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు శంకర్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఎ.జి.ఎం.రామకృష్ణ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి సహకార సంఘాల ప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు, బ్యాంక్ మేనేజర్లు,సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదనలు సమర్పించే సమయంలో సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టిత,వ్యాపార లావాదేవీలు,సంఘ సిబ్బంది వివరాలు,భౌగోళిక సమస్యలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఉపయోగపడే విధంగా పునర్విభజన జరగాలని తెలిపారు.గ్రామీణ రైతుల అవసరాల ప్రాతిపదికన నూతనంగా ఏర్పాడిన రెవెన్యూ మండలాల ప్రాతిపదికన రైతు సహకార సంఘాల పునర్విభజన చేయాలని తెలిపారు. సహకార సంఘాల పునర్విభజన రైతులకు ప్రయోజనకరంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యపై చలో కరీంనగర్

### డిజెఫ్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు కుశనపెల్లి సతీష్




**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 02 :** డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మహాసభను ఈనెల 10న కరీంనగర్ పట్టణంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో మహాసభను విజయవంతం చేయాలని డిజెఫ్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు కుశనపెల్లి సతీష్ కోరారు. గురువారం పట్టణంలోని విశ్రాంతి భవన ఆవరణలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లక్షెట్టిపేట మండల అధ్యక్షులు రాంపల్లి మధుచారి మాట్లాడుతూ... విలేకరుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే సంఘాన్ని ఆదరించాలన్నారు. ఈ మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మోట పలుకుల వెంకట్ తదితరులు హాజరువుతున్నారని, కరీంనగర్లో జరుగే మహాసభను విజయవంతం చేయాలని వారు కోరారు. మంచిర్యాల జిల్లా జర్నలిస్ట్ సోదరులందరికీ ఆహ్వానిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు సందీప్ యాదవ్, భానుచందర్, తిరుపతి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి ముఖచిత్రం క్యాలెండర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ , ఎస్పీ ఆఫీసులో జిల్లా ఎస్పీ ,డి.ఎస్.పి వారి వారి చేతుల మీదుగా వనపర్తి ముఖచిత్రం క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి , రా.ఖ రావుల గిరిధర్ రావు క్యాలెండర్ ఆవిష్కరిస్తూ వనపర్తి చరిత్రను ఇంత గొప్పగా తీర్చిదిద్దిన అఖిలపక్ష ఐక్యవేదికను అభినందిస్తూ నేటి యువతరానికి వనపర్తి చరిత్ర చెప్పడం చాలా అవసరం అని ఈ తరం మరిచిపోతున్న గతాలను మనమే గుర్తు చేయాల్సి వస్తుందని దాన్ని పరిపూర్ణంగా క్యాలండర్ ద్వారా ఆవిష్కరించిన సతీష్ యాదవ్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు , అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, బీసీ సంఘం నాయకులు గౌనికాడి యాదయ్య, శివకుమార్, రవి, అక్కడే ఉన్న మహిళా నాయకురాళ్ళు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకల విందు కోసం చోరీ

### దొంగలిద్దరూ నిర్మల్ జిల్లా భైంసా మండలం చుచుంద్ వాసులు

### చోరీ చేసిన గుడి గంటల స్వాధీనం విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిలా



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** నిర్మల్ జిల్లా భైంసా పట్టణ శివారులోని నాగదేవత ఆలయంలో చోరీ ఘటన కేసు 48 గంటల వ్యవధిలో పోలీసులు చేధించారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, పట్టణ సీఐ గోపినాథ్ లు సంబంధిత చోరీ ఘటన చేధించేందుకు గాను ప్రతిష్ఠాత్మకంగా వ్యవహారించి సత్ఫలితాలు సాధించారు. గురువారం ఉదయం భైంసాలోని ఎస్పీ క్యాంప్ ఆఫీస్ లో జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిలా చోరీ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భైంసా మండలం చుచుంద్ గ్రామానికి చెందిన విశాల్,సంఘ రతన్ అనే ఇద్దరు స్నేహితులు.నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గాను డబ్బులు లేకపోవడంతో చోరీ చేయాలని నిర్ణయానికి వచ్చారు. ఇందులో భాగంగానే నాగదేవత ఆలయానికి వెళ్లి మందిర తాళం పగులగొట్టి లోనికి వెళ్లి దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీ కానుకలతో పాటు గుడిలోని గంటలను సైతం వీరు చోరీ చేశారు.సంబంధిత ఘటనపై కేసు నమోదు చేసిన భైంసా పట్టణ పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా వ్యవహారించి దొంగలను పట్టుకున్నారు. దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో దొంగలిద్దరూ ధరించిన దుస్తులకు ఆలయంలోని పసుపు, కుంకుమ అంటుకుంది. అంతే కాకుండా చోరీ జరిగిన సమయంలో ఉదయం 4 గంటల నుండి 6 గంటల సమయంలో పట్టణ ప్రవేశ మార్గంలోని సీసీ కెమెరాలన్నింటిని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంలో చోరికి పాల్పడ్డిన ఇద్దరిలో ఒకరికి పసుపు, కుంకుమ అంటినట్లుగా గుర్తించి అనుమానితుడి భావించి విచారణ చేపట్టారు. ఆ తర్వాత సంబంధిత వ్యక్తులు ఇద్దరు చోరికి పాల్పడ్డట్లుగా నిర్ధారించి గురువారం ఉదయం అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు.48 గంటల వ్యవధిలో కేసును చేధించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ గోపినాథ్ తో పాటు పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ జానకీ షర్మిలా అభినందించారు.

## ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ తరపున డా. జనార్దన్ పన్నెల గారికి సన్మానం



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..** నిర్మల్ జిల్లా ఖానాపూర్లో ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీ తరపున ప్రముఖ పునరావాస మనోవిజ్ఞాన శాస్త్రవేత్త మరియు జానపద గాయకుడు డా. జనార్దన్ పన్నెల గారిని ఘనంగా సన్మానించడం జరిగింది.

డా.జనార్దన్ అమెరికాలో నివసిస్తూ, మన తెలంగాణ నుంచి అమెరికాకు వెళ్తున్న కళాకారులకు తన నివాసంలో బస అందిస్తూ,వారిని ప్రోత్సహిస్తూ,నేను ఉన్నాను"అనే భరోసాతో సహాయానికి ఎప్పుడూ ముందుంటారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో జనార్దన్ గారు ఎనలేని పాత్ర పోషిస్తున్నారు.

అలాంటి సేవా మూర్తిని మరియు జానపద గాయకుడిని సన్మానించడం ఫ్రెండ్స్ హెల్పింగ్ సొసైటీకి గౌరవంగా భావిస్తున్నాము

## ఇంకా ఎన్నేళ్లు అద్దె భవనాల్లో చదువులు

### ఎన్ టి ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్..



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 2**తెలంగాణ రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సొంత భవనాల నిర్మాణం చేపట్టాలని ఎన్ టి ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ యాదవ్, డిమాండ్ చేశారు.

హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట మండలంలో విలేకరుల సమావేశంలో నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తి అయిన ఇప్పటివరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సొంత భవనాల నిర్మాణం చేపట్టకపోవడం ప్రభుత్వం వైఫల్యం అని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల ముసలి కన్నీరు కారుస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటూ వారి జీవితాలను తుంగలో తొక్కుతూ రేపటి తరానికి విద్యార్థులకు విద్యను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దానికి నిదర్శనమే ఈ సంవత్సరకాలంలో విద్యారంగా సమస్యల పైన గాని పెండింగ్ లో ఉన్న అద్దె భవనాల బకాయిల చెల్లింపుల గురించి గానీ నూతన భవన నిర్మాణాల గురించి గానీ అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం కారణమని అన్నారు. ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల గాని విద్యారంగం పైన గాని చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా సొంత భవనాలను నిర్మించి రేపటి తరానికి విద్య రంగాన్ని గొప్ప స్థాయిలో చూపించాలని హెచ్చరించారు. ఇకనైనా సొంత భవనాల నిర్మాణం చేపట్టకపోతే రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

పరిగి వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ పరిధిలోని ఏబిఎస్ ప్లాజా సమీపంలో నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. కర్ణాటక కు చెందిన శాంత కుమార్ (35)ని ఎదురుగా వస్తున్న లారీని అతివేగంగా వచ్చి ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడు కర్ణాటక కు చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడు ఫైనాన్షియల్ జిల్లా ఫుడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఇంటిదగ్గర సమస్య ఉందని హైదరాబాద్కు చెందిన తన స్నేహితుడి బైక్పై వచ్చి మృత్యువాతపడ్డాడు.

## కానిస్టేబుల్ అభ్యర్థి మృతికి కారణాలివే

మచిలీపట్నంలో జరుగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల్లో ఎ. కొండూరుకు చెందిన దారావత్ చంద్రశేఖర్ (25) మృతి చెందడంపై పోలీసులు వివరణ ఇచ్చారు.కార్డియాటిక్ అరెస్టో మరణించినట్లు వైద్యులు వెల్లడించారన్నారు.ప్రాథమికంగా పరీక్షలు చేసిన రిపోర్టుల్లో అతనికి సెప్సిస్ కారణంగా చిఃఅ కౌంట్ 30వేలకు చేరిందన్నారు.అతను గత 5 రోజుల నుంచి తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోందని వైద్యులు తెలిపారు.

## నూతన సంవత్సరంలో నిర్మల్ జిల్లాను ముందంజలో నిలుపుదాం.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. నూతన సంవత్సరంలో నిర్మల్ జిల్లా మరింత ప్రగతి సాధించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు.అన్ని రంగాల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.

గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా అధికారులు,పలు కార్యాలయాల సిబ్బంది కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలిసి పూలమొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులు, కార్యాలయాల సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు నూతన సంవత్సరం లో కొత్త ఉత్సాహంతో ముందుకెళ్లాలని తెలిపారు. అధికారులు, సిబ్బందికి కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ,జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని,ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో ఉండాలని,అనుకున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని,పంటలు సమృద్ధిగా పండి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని మనసారా కోరుకుంటున్నానని అన్నారు.ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని,జిల్లాను మరి సుసంపన్నం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కలెక్టర్ ను కలిసేందుకు వచ్చిన వారందరు నోట్ బుక్కులు తీసుకురాగా,కలెక్టర్ వాటిని వసతి గృహాల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు తోడ్పాటును అందించిన వారందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు

## కుతాడి ప్రభాకర్ చేతుల మీదుగా టా ప్ర. డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ..



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 2తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జమ్మికుంట( ఎస్ టి ఓ ) శాఖ ఆధ్వర్యంలో గురువారం జమ్మికుంట పట్టణంలోని స్థానిక ఎస్ టి ఓ కార్యాలయంలో సూపరిండెంట్ కూతాడి ప్రభాకర్ చే,టా ప్ర డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, గౌరవాధ్యక్షులు కట్ట నాగభూషణాచారి, మాట్లాడుతూ టా ప్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆర్టీసీ మరియు సింగరేణి కార్మికుల కొరకు పోరాటం చేస్తున్నటువంటి ఏకైక సంస్థ అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎన్పీఎస్ విధానాన్ని రద్దు చేయాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం తాను మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, నూతన పి ఆర్ సి ని, జూలై 2023 నుండి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు అమలు చేయకపోవడం సరియైన విధానం కాదని మాట్లాడుతూ వెంటనే అమలు చేస్తూ పెండింగ్లోనున్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.ఆర్టీసీ సింగరేణి కార్మికులకు కనీస పెన్షన్ 15 వేల రూపాయలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో జమ్మికుంట శాఖ అధ్యక్షులు గరిగ చంద్రయ్య, గౌరవధ్యక్షులు శీలం మల్లేశం, హుజురాబాద్ శాఖ ట్రెజరరీ మండల వీరస్వామి, నాయకులు మారేపల్లి మొగిలయ్య, ముక్క ఐలయ్య, మేకమల్ల సుధాకర్, శీలంసారా భద్రస్వామి,ఎండి హసన్, శీలం దేవదాసు, ఖాజా మొయినుద్దీన్, బొల్లి సమ్మయ్య, కదారి విజయలక్ష్మి, ఎం శ్రీధర్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హైందవ శంఖారావానికి వందలాదిగా వేలాదిగా తరలి రావాలి వైవి రామయ్య



శిరివెళ్ల విజయవాడలో ఈనెల ఐదో తారీకు జరిగే హైందవ శంఖారావానికి మహానంది కంద, సిరివెళ్ల ప్రఖండలోని అన్ని హిందూ క్షేత్ర పరివార కార్యకర్తలు మరియు హిందూ బంధువులందరూ ఈనెల ఐదో తారీకు జరగబోయే హైందవ శంఖారావానికి వందలాది వేలాదిగా తరాలి రావాలని నంద్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు వైవిరామయ్య పిలుపునిచ్చారు. కాబట్టి ఈ ఒక్క హైందవ శంఖారావానికి హిందూ బంధువులందరూ కదలి రావాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కంద విభాగ్ నరసింహారెడ్డి, ప్రఖండ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రఖండ కార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రఖండసహ కార్యదర్శి నాగమల్లేశ్వర్ రెడ్డి, జిల్లా బజరంగ్దళ్ టోలి రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి మండల కన్వీనర్, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు భజన భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో మొట్టమొదటిసారిగా విశ్వహిందూ పరిషత్ పేరుతో హైందవ శంఖారావం ఏర్పాటు చేయడం జరిగింది. కలియుగంలో సంఘటన శక్తిగా హిందువులంతా మారాలని దేవాలయాల పరిరక్షణ కోసం దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోసం ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరు కూడా జయప్రదం చేయాలని వారు తెలియజేశారు.

## ఏపి కేబినెట్..కీలక అంశాలపై ఆమోద ముద్ర

అమరావతి ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 14 కీలక అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ రాజధాని అమరావతిలో 2733 కోట్ల పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అమరావతిలో రెండు ఇంజనీరింగ్ కాలేజీల పనులకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అలాగే భవనాలు, లేఔట్ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగిస్తూ చేసిన సవరణ ప్రతిపాదనకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంపు ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పింది. పిఠాపురం ఏరియా డెవలెప్మెంట్ అథారిటీలో 19 నూతన పోస్టులకు అనుమతి మంజూరు చేస్తూ మంత్రి మండలిలో ఆమోదం తెలిపారు.గుంటూరు జిల్లా, పత్తిపాడు మండలం, నదింపాలెం గ్రామంలో ఆరున్నర ఎకరాలు స్థలాన్ని 100 బెడ్ల ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఇస్తూ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటితో పాటు ఎజెండా పూర్తయ్యాక పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. ఎస్ఐపీబీ ఆమోదించిన 1,82,162 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 2,63,411 మందికి ఉద్యోగాలు కల్పించే అంశంపై కూడా కేబినెట్లో చర్చించారు.నెల్లూరు జిల్లా రామయ్యపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు ఏపీ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా ఐదు సంస్థలు క్లీన్ ఎనర్జీలో 83 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోద ముద్ర పడింది.సూపర్ సిక్స్ పథకాలకు ఏపీ కేబినెట్ పచ్చ జెండా ఊపింది.వచ్చే విద్యాసంవత్సరంలోపు తల్లికి వందనం అమలు చేయాలి అని ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేసింది. మంత్రివర్గ సమావేశం ముగిశాక తాజా రాజకీయ పరిణామాలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు.

## వైకుంఠధామ అభివృద్ధి పనులు 50 లక్షల నిధులు మంజూరు

## మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు



హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి డిసెంబర్ 2 జమ్మికుంట పట్టణంలో గల వైకుంఠధామానికి 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాలకవర్గం ఏర్పడినప్పటి నుండి సిసి రోడ్లు డ్రైనేజీలు మురికి కాలువలు శ్మశానవాటికలు గాని అన్ని రకాలుగ అభివృద్ధి చేశామని వారు తెలిపారు. అంతేకాకుండా ప్రతి వార్డులో తమ కౌన్సిలర్లు అందరూ నాడు- నేడు అనే విధంగా ప్రతి ఒక్కరూ తమ వార్డుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వారు తెలిపారు. అనాథ శవాలు గాని,సొంత ఇల్లు లేని వారు గాని వారి కార్యక్రమాలు పూర్తి అయ్యే వరకు ఇక్కడే అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. అదే విధంగా ప్రైవేటుపరమైన ఈ యొక్క స్మశాన వాటికను మున్సిపల్ వారికి అప్పగించిన డాక్టర్ రాజేశ్వరయ్య ను,చందా విశ్వనాథంను ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరిని వారు అభినందించారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ స్థానిక కౌన్సిలర్ భోగం సుగుణ,కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్,గాజుల భాస్కర్,బచ్చు శివశంకర్,దిడ్డి రాము, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..



## బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ప్రకటన

× సినిమా డైలాగ్‌లకు మాత్రమే పరిమితమైన సిఎం రేవంత్ రెడ్డీ
× రైతు సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైన రేవంత్ ప్రభుత్వం
× రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలి
× రైతు కూలీలకు కేటాయించిన నిధులు ఎక్కడకు వెళ్లాయి
× ఎల్లుండి జరిగే కేబినెట్ భేటీలో రైతు భరోసాపై సరైన నిర్ణయం తీసుకోవాలి



హైదరాబాద్ జనవరి 2 కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని వేల కోట్ల కుంభకోణాలు జరిగాయని.. వాటిని త్వరలో బయట పెడతామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఇందులో మంత్రులు ఎవరెవరు ఇన్వాల్ అయ్యారో ఆధారాలతో సహా చెబుతామని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూస్తామని అన్నారు. రేవంత్ రెడ్డీ సినిమా డైలాగ్‌లకు మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధుపై తన విధి విధానాలు ఏందో చెప్పిందని అన్నారు. రాష్ట్ర రైతాంగం మీద కాంగ్రెస్ ప్రభుత్వ విధి విధానాలు ఏంటో చెప్పాలని డిమాండ్ ఛ్జేసారు.. రైతు సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం ఘోరంగా విఫల అయిందని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు.రైతు బంధును రైతు భరోసాగా పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏం లేదని ఆరోపించారు. గురువారం బీజేపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.... గడిచిన ఏడాది అంత కాంగ్రెస్ మోసాల సంవత్సరమని విమర్శించారు. కొత్త ఏడాదిలో అయినా కాంగ్రెస్ ప్రభుత్వం మంచి బుద్ధి అలవరచుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం ఇచ్చిన మొదటి హామీ రైతు రుణమాఫీ అని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క లేనిపోని గొప్పలు చెబుతున్నారని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు.రైతు కూలీలకు కేటాయించిన నిధులు ఎక్కడకు వెళ్లాయని ప్రశ్నించారు. 15లక్షల మంది ఉన్నట్లు రెవెన్యూ మంత్రి లెక్కలు చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రూ. 9వేల కోట్లను డిసెంబర్ 28వ తేదీలోగా రైతుల ఖాతాల్లో వేస్తామని చెప్పి సబ్ కమిటీ ఏర్పాటు చేశారని అన్నారు. ఇందుకోసం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సబ్ కమిటీ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కమిటీ నివేదికను ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎల్లుండి జరిగే కేబినెట్ భేటీలో రైతు భరోసాపై సరైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. రబీ అయిపోయింది.. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి ప్రోత్సాహం ఇస్తారో కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

## కరీంనగర్ పోలీస్ కమిషనర్ - అభిషేక్ మొహంతి



కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీ ల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు,ర్యాలీలు నిర్వహించ కూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుంది అన్నారు.ఈ చట్టం అమలులో వుండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు.జన సంచారం మరియు అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com